@vaartanews @mvnewstv
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
గురువారం
10 సెప్టెంబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
www.mivaartanews.com
TGBIL/25/A0512
సంపుటి : 02
సంచిక :70
పేజీలు : 12 వెల : 5/-
PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE



వార్త
విలేకరులు కావలెను
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
91-8522888459 9515342857




# భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు



# విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన


# ఆ రెండూ కుట్రలే!

- స్పీకర్‌ను, శుద్ధి పేరుతో దళితులను అవమానించటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది
- వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై కేసులు పెడతాం: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తాం
- విచారణాధికారిగా హైదరాబాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్
- ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకే కుట్రలు
- ఫామ్‌హౌస్ భేటీలోనే వ్యూహరచన.. కేసీఆర్ అనుచరులను ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారు
- దళితులను అవమానించిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలన్న సీఎం
- వారిలోని అహంకార, అంటరానితన భావాన్ని యాసిడ్‌తో శుద్ధి చేయాలా? అంటూ ప్రశ్న
- ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టీకరణ



హైదరాబాద్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ఆయన మాతృమూర్తిని కించపరిచి అవమానించటం, అనంతరం ఆయనకు మద్దతుగా నిరసన తెలిపిన దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలను కుట్రలుగానే పరిగణిస్తున్నామని చెప్పారు. ఇందుకు వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై ఆయా సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తామని అన్నారు. ముంబయిపై దాడి చేసిన కసబ్ లాంటి ఉగ్రవాదులకు కొన్ని అంశాలను నూరిపోసి ఉన్మాదులుగా మార్చి మన దేశంపైకి పంపిన తరహాలోనే, కేసీఆర్ కూడా తన అనుచరులకు ఇలాగే నూరిపోసి ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారని ఆరోపించారు. దాంతో పేట్రేగిన నేతలు ఆ రోజు దళిత స్పీకర్‌ను కించపరచటమే లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఆ కార్యక్రమానికి ముందురోజు ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీలో చేసిన కుట్ర మొదలు ఆ తర్వాత వరుసగా చోటుచేసుకున్న ఘటనలపై సంపూర్ణ విచారణ చేపడతామన్నారు. హైదరా బాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్ విజయకుమార్‌ను - మిగతా 11లో



# కోహెడకు రూ.637.70 కోట్లు

- ప్రపంచస్థాయి పండ్ల మార్కెట్ తొలి దశ పనులకు అనుమతి
- 178.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు
- మొదటి దశలో భాగంగా ఆరు వేలం హాళ్లు, వాటికి అనుబంధంగా మీజనైన్ ఏసీ అంతస్తులు నిర్మించనున్నారు.

హైదరాబాద్

రాష్ట్ర రాజధానికి సమీపంలో కోహెడలో నిర్మించనున్న ప్రపంచస్థాయి సమగ్ర పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడటమే లక్ష్యంగా దీన్ని నిర్మిస్తోంది. మార్కెట్ తొలి దశ పనులకు రూ.637.70 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా - మిగతా 3లో

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు



## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల

# సస్పెన్షన్



- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్
- సభను అడ్డుకుంటున్న సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- దీంతో సస్పన్షన్ వేటు వేస్తూ ప్రకటించిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- బీఆర్ఎస్ సభ్యులను సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన స్పీకర్

హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, - మిగతా 11లో

## శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు

# బీఆర్ఎస్ ఫిర్యాదు



- నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించాం
- శాసనసభ్యులపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం
- లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన నేతలు
- శాంతిభద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్

లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపామని, ఎమ్మెల్యే సబితపై పోలీసుల దాడి, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించామని తెలిపారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని శివ్‌ప్రతాప్ శుక్లాకు వివరించామని పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా - మిగతా 11లో

సంపాదకీయం

# వ్యవసాయానికి డేంజర్ బెల్స్

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జూలైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉండటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నా.. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. చెరువులు నిండకపోతే భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క. ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశంలో పడని వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీర్చాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోను వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణంగా 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 132.4 లక్షల ఎకరాలు. ఈసారి సెప్టెంబర్ 2 నాటికి 119.6 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అంటే సాధారణ సాగులో దాదాపు 90 శాతం పూర్తయింది. గతేడాది ఇదే సమయానికి 123.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఏపీలోనైతే సాధారణ విస్తీర్ణం 76.2 లక్షల ఎకరాలు. ఈసారి వేసింది 57.8 లక్షల ఎకరాలు. గతంలో పోల్చుకుంటే 18.4 లక్షల ఎకరాలు తగ్గింది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 24.1 శాతం తక్కువగా ఉంది.దేశవ్యాప్తంగా ఈసారి ఖరీఫ్‌లో సెప్టెంబర్ 4 నాటికి 1,086 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. అంటే సుమారు 268.5 మిలియన్ ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే దేశంలో సాగు విస్తీర్ణం 1.6 శాతం తక్కువగా ఉంది.మబ్బులో నుంచి వచ్చిన నీటిలో ఎంత మన దగ్గర నిలిచింది. చెరువుల్లో ఎంత చేరింది. భూగర్భంలోకి ఎంత వెళ్లింది. ప్రాజెక్టుల్లో ఎంత నిల్వ ఉంది. కాలువల్లోకి ఎంత విడుదలైంది. రైతు పొలానికి ఎంత చేరింది. ఆ నీటితో ఎంత పంట పండింది. ఆ పంటతో రైతు చేతిలో చివరికి ఎంత మిగిలింది. ఈ మొత్తం లెక్కే తెలంగాణ నీటి అసలు లెక్క.ఆకాశం వాన ఇవ్వాలి. చెరువు నీటిని దాచుకోవాలి. ప్రాజెక్టు నీటిని పొలానికి చేర్చాలి. రైతు పంట పండించాలి. పంటకు మంచి ధర రావాలి. అప్పు తీరాలి. అప్పుడే నీటి లెక్క రైతు జీవితంలో మంచి ఫలితంగా మారుతుంది. వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో నీరు కాదు. నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది కేవలం వర్షం కాదు. మన నీటి నిర్వహణ అనేది నిజం. ఆ దిశగా పాలకులు ఆలోచిస్తే అన్నదాత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

# ఇస్రో పై 'వేటు'?



నరేంద్రమోదీ నేతృత్వంలో 12 ఏండ్ల క్రితం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడు తుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయి. జరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. నాయకత్వం మాత్రం ప్రభుత్వ సంస్థ చేతుల్లోనే ఉండాలి. లేకపోతే ప్రపంచం విస్తుపోయే అభివృద్ధిని సాధించిన ఇస్రో, రేపు కార్పొరేట్ లాభాల వేటలో

# చట్టసభల దగ్గరే ప్రజాస్వామ్యానికి తూట్లు




తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలి రోజే జరిగిన పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా కలవరపెట్టేవిగా ఉన్నాయి. సభలో ప్రతిపక్షం -- అధికారపక్షం మధ్య రాజకీయ ఘర్షణలు జరుగడం కొత్త కాదు. కానీ శాసనసభ్యులు సభలోకి ప్రవేశించకముందే పోలీసుల ద్వారా అడ్డుకోవడం, నిరసన వ్యక్తం చేయడానికి వారు ఎంచుకున్న దుస్తులను కూడా ఒక సమస్యగా పరిగణించడం దారుణం. ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తీసుకొచ్చేవిగా ఉన్నాయి. ప్రతిపక్ష సభ్యులు నల్ల దుస్తులు ధరించడం ఒక నిరసన రూపం. అది సభా కార్యకలాపాలను అడ్డుకోవడం కంటే ముందే నేరంగా మారిపోదు. దుస్తులపై ఏవైనా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఉంటే వాటిని తీసేసి రమ్మని చెప్పవచ్చు. నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యంలో అధికారపక్షానికే కాదు, ప్రతిపక్షానికీ ఉంటుంది. ఆ నిరసన సభా నియమాలను ఉల్లంఘిస్తే సభాపతి చర్య తీసుకోవచ్చు. కానీ సభా ప్రాంగణంలోకి అడుగుపెట్టకముందే పోలీసుల ద్వారా సభ్యులను అడ్డుకోవడం మాత్రం అత్యంత తీవ్రమైన పరిణామం. శాసనసభ్యులను పోలీసులు తోసేయడం, లాగడం, అడ్డుకోవడం ప్రజాస్వామ్య సంస్థల గౌరవానికి విరుద్ధం. మహిళా శాసనసభ్యుల విషయంలో పోలీసుల ప్రవర్తన మరింత ఆందోళన కలిగించే విషయం. మహిళా సభ్యులను పురుష పోలీసులు అడ్డుకున్నారనే ఆరోపణలు నిజమైతే, అది కేవలం పోలీసింగ్ పద్ధతిపై మాత్రమే ప్రశ్న కాదు, మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, భద్రత, హక్కులపై ప్రశ్న. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలువాల్సిన శాసనసభ గుమ్మం దగ్గరే ఇటువంటి దృశ్యాలు కనిపించడం మంచి సంకేతం కాదు. దేశ రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘర్షణలు ఎన్నో హెచ్చరికలు ఇచ్చాయి. తమిళనాడు శాసనసభలో జయలలితకు ఎదురైన అవమానకర ఘటనలు ఇప్పటికీ రాజకీయ చరిత్రలో మిగిలిపోయాయి. సభలో రాజకీయ ప్రత్యర్థిత్వం హద్దులు దాటితే అది వ్యక్తుల మధ్య ఘర్షణగా మొదలై, చివరకు సంస్థల ప్రతిష్టను దెబ్బతీస్తుంది. తెలంగాణ ఆ దారిలో నడువకూడదు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యల వివాదాన్ని కూడా రాజకీయ వివేకంతో చూడాల్సిన అవసరం ఉన్నది.

తాను చేసిన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి కాదని ఆయన స్పష్టంచేశారు. ఒకవేళ స్పీకర్‌కు అలా అనిపించినట్టయితే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటానని, తన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానని కూడా ప్రకటించారు. ఒక ప్రజాప్రతినిధి తన వ్యాఖ్యపై విచారం వ్యక్తం చేసిన తర్వాత కూడా అదే అంశాన్ని సభ మొత్తాన్ని స్తంభింపజేసే స్థాయికి తీసుకెళ్లడం అవసరమా అనేది ఆలోచించాల్సిన ప్రశ్న.

స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనది. ఆ పదవిని అవమానించేలా ఎవరు మాట్లాడినా ఖండించాల్సిందే. అదే సమయంలో స్పీకర్ కూడా సభను అన్ని పక్షాలకు సమానంగా అందుబాటులో ఉంచే రాజ్యాంగబద్ధమైన పాత్రను పోషించాలి. ఒక సభ్యుడి వ్యాఖ్యను మొత్తం ప్రతిపక్షానికి, ఒక పార్టీకి, లేదా ఒక సామాజిక వర్గానికి అంటగట్టడం కూడా సరైన ప్రజాస్వామ్య పద్ధతి కాదు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉన్నది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య తీవ్రంగా ఉన్నది. ఉద్యోగులు పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోసం చూస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై ముందస్తు ప్రణాళిక అవసరమని నిపుణులు సూచనలు చేస్తున్నారు. ప్రజల భూములను నిషేధిత జాబితాలో చేర్చి, వాటి పరిష్కారంలో పారదర్శకత లేకపోవడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి సమస్యలపై సభలో సమగ్ర చర్చ జరుగాల్సిన సమయంలో సభ ఈ విధమైన గందరగోళమైన పరిస్థితిలో నడువడం, సభా సమయాన్ని వృథా చేయడం ప్రజల పట్ల అన్యాయం. ఇక్కడ కాంగ్రెస్‌కు ఒక విషయం గుర్తుండాలి. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంటును నిర్వహించకుండా ఆటంకాలు కలిగిస్తున్నదని కాంగ్రెస్ విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. ప్రధాని, హోంమంత్రి సభకు రావాలని డిమాండ్ చేస్తూ సభను స్తంభింపజేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మరి అదే రాజకీయ సంస్కృతి రాష్ట్ర శాసనసభలో అధికారపక్షంగా ఉన్నప్పుడు ఎందుకు మారాలి? ప్రజాస్వామ్యం అంటే అధికారపక్షం మాట్లాడటం కాదు. ప్రతిపక్షం మాట్లాడటం కూడా కాదు. అధికారపక్షం మాట్లాడినంత సమయం ప్రతిపక్షానికి కూడా మాట్లాడే అవకాశం ఉండటం. ప్రతిపక్షం నిరసన తెలిపినంత మాత్రాన దాన్ని అణచివేయకుండా, సభా నియమాల పరిధిలో ఎదుర్కోవడం, సభా సమయాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం. పోలీసులు ప్రభుత్వానికి రాజకీయ రక్షక దళం కాదు. వారు చట్టాన్ని అమలు చేసే వ్యవస్థ. ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రభుత్వ శత్రువులు కాదు. వారు ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు. ఈ రెండు వాస్తవాలను ప్రభుత్వం మరచిపోతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడుతుంది. సోమవారం జరిగిన ఘటనను కేవలం కాంగ్రెస్‌బీఆర్ఎస్ రాజకీయ గొడవగా కొట్టిపారేయడం సరిపోదు. ఇది తెలంగాణ శాసనసభ ప్రతిష్టకు సంబంధించిన విషయం. సభ గుమ్మం దగ్గరే ప్రజాప్రతినిధులను అడ్డుకొనే పరిస్థితి ఏర్పడితే, రేపు ఏ ప్రభుత్వం వచ్చినా అదే పద్ధతిని అనుసరించే ప్రమాదం ఉంటుంది కదా! ఒకసారి అధికారానికి ఈ మార్గం అలవాటైతే, ప్రతిపక్షంలోకి వెళ్లినప్పుడు అదే అధికారాన్ని విమర్శించే నైతిక హక్కు రాజకీయ పార్టీలకు బలహీనమవుతుంది.

జరిగినది ఎవరి విజయమూ కాదు. అధికారపక్షానిది కాదు, ప్రతిపక్షానిదీ కాదు. అది ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టం. శాసనసభ గుమ్మం ప్రజాప్రతినిధులకు మూసుకుపోయే రోజు ప్రజల గొంతుకకు కూడా తలుపులు మూసుకుపోయిన రోజు. తెలంగాణ రాజకీయ వ్యవస్థ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకూడదు. అధికారపక్షం ప్రతిపక్షాన్ని గౌరవించాలి. ప్రతిపక్షం సభా నియమాలను గౌరవించాలి. స్పీకర్ అన్ని పక్షాలకు న్యాయమైన వేదిక కల్పించాలి. పోలీసులు రాజకీయ ఆదేశాల కంటే రాజ్యాంగబద్ధమైన బాధ్యతకు కట్టుబడి ఉండాలి. లేకపోతే శాసనసభ ప్రజాస్వామ్య చర్చల నిలయం కాకుండా, అధికార -- ప్రతిపక్ష యుద్ధరంగంగా మిగిలిపోతుంది. ప్రజలు మాత్రం బయట నిలబడి తమ సమస్యలకు సమాధానం కోసం ఎదురు చూస్తూనే ఉంటారు.

# దళితబంధు లబ్ధిదారుల అకౌంట్ లో కెళ్ళి డబ్బులు ఎక్కడికి పోలేదు.. వొడితల ప్రణవ్..





- కౌశిక్ రెడ్డి దుష్ప్రచారాన్ని దళిత సమాజం గమనిస్తుంది.
- అకౌంట్ లో కెళ్ళి ఒక్క రూపాయి కూడా పోలేదు..నిరూపించకపోతే రాజీనామా చేసి,ముక్కు నేలకు రాసి,క్షమాపణ చెప్పాలి...
- అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ కౌశిక్ రెడ్డి..

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 09

దళిత బంధు నిధుల విషయంలో దళితులను మోసం చేసి వారికి నిధులు రాకుండా అడ్డుకున్న వ్యక్తి కౌశిక్ రెడ్డి అని,ఇప్పుడు మరల సోషల్ మీడియా వేదిక ద్వారా కొత్త డ్రామాకి తెరలేపుతూ దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న డబ్బులు 50 కోట్లు రూపాయలను వెనక్కి తీసుకున్నారన్న మాటల్లో నిజం లేదని,అబద్ధాలు ఆడటంలో కౌశిక్ రెడ్డినీ మించిన వారు లేరని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50కోట్ల దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న నిధులు వెనక్కి తీసుకున్నామన్న వ్యాఖ్యల్లో నిజంలేదని,అది నిరూపించకపోతే ముక్కు నేలకు రాసి దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఓట్ల కోసం దళితులను వాడుకున్నారనే తప్ప నిజంగా వారి సంక్షేమం కోసం ఆలోచించే వారైతే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఎందుకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయలేదనీ ప్రశ్నించారు.మొదటి నుండి బీఆర్ఎస్ పార్టీ కౌశిక్ రెడ్డి దళిత సమాజానీకి వ్యతిరేకమని అన్నారు.నిధులు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం,పార్టీదని త్వరలో నిధులు విడుదల చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తీరుపై.. భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు





-----స్పీకర్‌ను దూషించిన వారి సభ్యత్వం రద్దు చేయాలి

--- నాచారం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లో ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు

మల్లాపూర్, సెప్టెంబర్ 9 ( మన మీ వార్త):

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దళితుడైన స్పీకర్‌ను ఎలా దూషిస్తారంటూ ప్రశ్నించారు. కేసులు నమోదు చేయడం, సభ నుంచి సస్పెన్షన్ చేయడం కాదు.. ఏకంగా సభ్యత్వాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపు మేరకు నాచారం, మల్లాపూర్, శక్తిసాయినగర్, హెచ్ఎంటీనగర్, హెచ్‌బీకాలనీ డివిజన్లల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ పట్ల వ్యవహరించిన తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు.దళితుడైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల దురుసుగా, అమార్యదగా, దుర్భాషలాడిన ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేవలం ఈ సెషన్ సమావేశాలకు మాత్రమే రాకుండా సస్పెండ్ చేయడం సరైన చర్య కాదన్నారు. దీనికి పూర్తి బాధ్యత కేటీఆర్, హరీష్‌రావునే వహించాలన్నారు. కార్యక్రమంలో నాచారం, హెచ్ఎంటి కాలనీ,మల్లాపూర్,శక్తిసాయి నగర్ కాలనీ, హెచ్ బి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా.. జవహర్ నగర్ కు చెందిన కర్నే సురేందర్

జవహర్ నగర్ సెప్టెంబర్ 9:(వార్త ప్రతినిధి)






సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.
ఈ పురస్కారాలలో భాగంగా మేడ్చల్ జిల్లా, జవహర్ నగర్ నివాసి స్థానిక గీతాంజలి హైస్కూల్ వైస్ ప్రిన్సిపల్ గా సేవాలందిస్తున్న కర్నే సురేందర్ "రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు" కు ఎంపికయ్యారు.

**ఉన్నత విద్యామండలి చైర్మన్ చేతుల మీదుగా సత్కారం:**
కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ వి. బాలకృష్ణా రెడ్డి చేతుల మీదుగా కర్నే సురేందర్ ఈ అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.విద్యా రంగంలో విద్యార్థుల సమగ్ర వికాసానికి,బోధనా ప్రమాణాల పెంపునకు సురేందర్ అందిస్తున్న విశేష సేవలను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.

**అభినందనల వెల్లువ:**
రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై గుర్తింపు పొందిన కర్నే సురేందర్ కు గీతాంజలి పాఠశాల యాజమాన్యం, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు జవహర్ నగర్ ప్రాంత ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రైవేట్ విద్యా రంగంలో సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల గుర్తింపునకు ఈ పురస్కారం ఎంతో స్ఫూర్తినిస్తుందని సురేందర్ ఈ సందర్భంగా తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# నవరాత్రి ఉత్సవాల నిర్వాహకుల సన్నాహక సమావేశం.

తూప్రాన్/మనోహరబాద్ సెప్టెంబర్ 9 మన మీ వార్త ప్రతినిధి.





వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తూప్రాన్ పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్స్‌లో వినాయక ఉత్సవాల నిర్వాహకులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి తూప్రాన్ సర్కిల్ పరిధిలోని తూప్రాన్, మనోహరాబాద్,శివ్వంపేట్, వెల్దుర్తి, మండలాలకు చెందిన వినాయక ఉత్సవాల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, వినాయక ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, ఊరేగింపుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్,ఆర్డీవో జయచంద్రారెడ్డి,తూప్రాన్ ఎస్ఐ వి. గంగరాజు, శివ్వంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి,వెల్దుర్తి ఎస్ఐ కర్నాకర్ రెడ్డి,తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ఓ విద్యుత్ శాఖ ఏఈ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో మరియు పరస్పర సహకారంతో నిర్వహించుకోవాలని, పోలీస్ మరియు ఇతర ప్రభుత్వ శాఖలకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని అధికారులు సూచించారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా మండపాలు మరియు ఊరేగింపులు నిర్వహించాలని అధికారులు సూచించారు.

## కాళోజి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య

చిట్యాల సెప్టెంబర్ 10 (మీవార్త)



కాళోజి ఆశయాలను ప్రతి ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలని చిట్యాల గ్రామ సర్పంచి తవుటమ్ లక్ష్మి అంతయ్య అన్నారు. చిట్యాల గ్రామపంచాయతీలో తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ తవుటం లక్ష్మి అంతయ్య ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ హాజరై ముందుగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల కోసం చేసిన సేవలను, ఆయన సాహిత్య కృషిని స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ఎత్తిచూపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు తౌటం నవీన్, మైదం శ్రావ్య శ్రీకాంత్, గ్రామపంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, జీపీఓ రాజు ,అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,



చిట్యాల సెప్టెంబర్ 09 (మీవార్తా)

భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్, బుధవారం టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి హాజరైన వొడితల ప్రణవ్..





ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పేదవాడి ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ వారికి సొంతింటి కలను నెరవేరుస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున హుజురాబాద్ మండలం జూపాక గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని నూతన గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రాబోయే రోజుల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,మండల అధ్యక్షుడు కిరణ్,ప్రజా ప్రతినిధులు,జూపాక గ్రామ నాయకులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకట్ రెడ్డి నగర్ డివిజన్లో జలమండలి అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించిన ఆకారపు అరుణ్ పటేల్

వెంకట్ రెడ్డి నగర్, సెప్టెంబర్ 9 ( మన మీ వార్త):





వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సత్యనగర్, లక్ష్మీ శ్రీకాంత్ నగర్ కాలనీల్లో నెలకొన్న మురుగునీటి సమస్య పరిష్కారానికి ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు.ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, అధికారికంగా మంజూరు కానప్పటికీ సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదనంగా సుమారు 150 మీటర్ల డ్రైనేజీ పైప్‌లైన్ పనులు చేపట్టేలా కాంట్రాక్టర్‌తో నేరుగా మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ప్రధాన రోడ్డుపై అక్రమంగా నిర్మించిన షెడ్ కారణంగా డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఇబ్బందులు ఏర్పడుతున్న విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే షెడ్డును తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ రవీందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వినయ్, స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. మిగిలిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులను ఆకారపు అరుణ్ పటేల్ కోరారు.

## నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ నీరు విడుదల చేయాలని కూచాడి శ్రీహరి రావు విజ్ఞప్తి

లక్ష్మణ్ చందా, సెప్టెంబర్ 09(మన మీ వార్త న్యూస్)



నిర్మల్ నియోజకవర్గ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్సారెస్పీ సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు కోరారు. ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో ఫోన్‌లో మాట్లాడి నిర్మల్ నియోజకవర్గానికి సరస్వతి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించి, సరస్వతి కాలువకు నీటిని విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి కూచాడి శ్రీహరి రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచాడి శ్రీహరి రావు తో పాటు లక్ష్మణ్‌చందా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్రో నరేశ్ రెడ్డి , మామడ మాజీ జడ్పీటీసీ మొహమ్మద్ రఫీ , మామడ మాజీ సర్పంచ్ బాపయ్య మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా, సెప్టెంబర్ 09(మన మీ వార్త న్యూస్)



కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, మజార్, ముజాహిద్ శ్రావణ్, అజార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తవ్విన రోడ్లతో కాలనీ వాసులకు తప్పని తిప్పలు నెలలు గడుస్తున్నా తవ్విన రోడ్లకు మోక్షం లేదు

---పునరుద్ధరణకు డిప్యూటీ కమిషనర్ తో కాలనీవాసుల విజ్ఞప్తి

ఉప్పల్, సెప్టెంబర్ 9 ( మన మీ వార్త):



ఉప్పల్ పరిధిలోని హనుమ సాయి నగర్, విజయపురి కాలనీ, సూర్యనగర్ కాలనీల్లో తవ్విన రోడ్లను నెలలు గడుస్తున్నా పునరుద్ధరించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమ సాయి నగర్, విజయపురి కాలనీ, సూర్యనగర్ కాలనీలను కలిపే జంక్షన్ నుంచి ఆయా కాలనీల వైపు వెళ్లే రోడ్లను తవ్వి నెల రోజులు దాటినా పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఎలివేటెడ్ కారిడార్ పనుల కారణంగా వరంగల్ హైవేను మూసివేయడంతో వాహనాల రాకపోకలు హనుమ సాయి నగర్, విజయపురి కాలనీ, సూర్యనగర్ కాలనీల మీదుగా నాగోల్ వైపు మళ్లాయి. దీంతో తవ్విన రోడ్లు, గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు స్పష్టంగా లేకపోవడంతో వాహనదారులు ఎటువైపు వెళ్లాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం తవ్విన రోడ్లు గుంతలమయంగా మారి ప్రజలకు నరకయాతనను మిగుల్చుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్లను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి తవ్విన రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కాలనీవాసులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్ల పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల మధుసూదన్ రెడ్డి, సూర్యనగర్ కాలనీ అధ్యక్షులు జెట్ట సుధాకర్, ఫకీరు నర్సిరెడ్డి, లింగారెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీమతి గుండు సుధారాణి

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



వరంగల్ పోచమ్మ మైదాన్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో బుధవారం రోజున కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఖుఖణూ) చైర్ పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జి డబ్ల్యూ ఎం సి మాజీ మేయర్ గుండు సుధారాణి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినారు.

# అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

చిలుకా నగర్, సెప్టెంబర్ 9 ( మన మీ వార్త):





చిల్కానగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్‌ను కలిసి పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలంటూ వినతిపత్రం అందజేశారు. సాయిరాంనగర్ కాలనీలో పలు సీసీ రోడ్లు, ఇందిరానగర్ కాలనీలో సీసీ రోడ్డు, ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు వెళ్లే ప్రధాన రహదారి సీసీ రోడ్డు తదితర పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. అదేవిధంగా చిల్కానగర్ బొడ్రాయి ఎదురుగా ఉన్న వీధులు, కుమ్మరికుంటలోని రోడ్ నంబర్-3కు సంబంధించిన సీసీ రోడ్డు పనులకు ఇప్పటికే సాంక్షన్లు పూర్తయినప్పటికీ టెండర్లు నిర్వహించకుండా కాలయాపన జరుగుతోందని పేర్కొన్నారు. వెంటనే టెండర్లు పిలిచి సీసీ రోడ్డు పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. చిల్కానగర్ డివిజన్‌లో పారిశుధ్య సమస్యలపై కూడా ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జీవీపీ పాయింట్ల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి, ఉదయం 9 గంటలలోపే చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ వినతిపై డిప్యూటీ కమిషనర్ ఆనంద్ సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, శానిటేషన్ డీఈ నీలిమ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, జల్లి మోహన్, కొక్కొండ జగన్, బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.6.97 కోట్ల ధాన్యం బకాయిలు

- వెంకటరమణ రైస్ ఇండస్ట్రీస్ సీజ్
- సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అప్పగించని వైనం
- ధాన్యం పక్కదారి పట్టించారన్న ఆరోపణలు
- అదనపు కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, పోలీసుల చర్య
- పాన్‌గల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద అధికారుల మెరుపు తనిఖీ

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో సెప్టెంబర్ 09 మీ వార్త



పాన్‌గల్ :ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్‌కు అప్పగిస్తే దాన్ని బియ్యంగా మార్చి నిర్ణీత గడువులో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉంటుంది. అయితే పాన్‌గల్ మండల కేంద్రంలో ఈ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం బకాయిల విలువ సుమారు రూ.6.97 కోట్లకు చేరిన నేపథ్యంలో వెంకటరమణ రైస్ ఇండస్ట్రీస్‌ను అధికారులు సీజ్ చేశారు. పాన్‌గల్ అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని ఈ మిల్లుపై జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్ ఆదేశాలతో బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కార్తీక్‌రావు, ఎస్సై కురుమయ్య తమ సిబ్బందితో మిల్లు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించి గేట్లకు సీళ్లు వేశారు.

**సీఎంఆర్ బియ్యం ఎక్కడ?**

ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి బియ్యం రూపంలో అప్పగించాల్సి ఉండగా. భారీ మొత్తంలో బకాయిలు ఎందుకు పేరుకుపోయాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు రూ.6.97 కోట్లకు చేరడం అధికార వర్గాల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా పక్కదారి పట్టించారా? లేక మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఇతర మార్గాల్లో విక్రయించారా? ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బియ్యం, దాని విలువకు సంబంధించిన పూర్తి లెక్కలు ఏమిటన్న దానిపై అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**అదనపు కలెక్టర్ ఆదేశాలతో ఉక్కుపాదం...**

మిల్లు యాజమాన్యం నుంచి ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బకాయిలపై జిల్లా యంత్రాంగం సీరియస్‌గా వ్యవహరించింది. అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు శాఖలు రంగంలోకి దిగాయి. మిల్లులోని ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వలు, సంబంధిత రికార్డులు, బకాయిల వివరాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

**మిల్లర్లలో గుబులు...**

ఒక మిల్లుపై కోట్ల రూపాయల సీఎంఆర్ బకాయిల నేపథ్యంలో అధికారులు సీజ్ చర్యలకు దిగడంతో మండలంలోని ఇతర రైస్ మిల్లర్లలోనూ చర్చ మొదలైంది. ప్రభుత్వ ధాన్యం తీసుకున్న ప్రతి మిల్లులోనూ ధాన్యం కేటాయింపు, మిల్లింగ్, సీఎంఆర్ బియ్యం అప్పగింత, బకాయిలు, స్టాక్ వివరాలను అధికారులు సమగ్రంగా పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రికార్డులపై ఫోకస్...**

ప్రభుత్వం నుంచి ఎంత ధాన్యం తీసుకున్నారు? ఎంత మిల్లింగ్ చేశారు? ఎంత బియ్యం ప్రభుత్వానికి అప్పగించారు? ఇంకా ఎంత బకాయి ఉంది? బకాయి విలువ రూ.6.97 కోట్లకు ఎలా చేరింది? ధాన్యం, బియ్యం స్టాక్ ప్రస్తుతం ఎక్కడ ఉంది? అనే అంశాలపై పూర్తిస్థాయి లెక్కలు తేలాల్సి ఉంది. ఈ వివరాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ సీజ్ ప్రక్రియలో ఆర్ఐ మహేష్, గ్రామ పాలనాధికారి రాధ, పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ ధాన్యానికి కాపలాదారులెవరు...?**

కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ధాన్యం మిల్లుకు తరలిన తర్వాత దాని ప్రతి కిలోకు లెక్క ఉండాలి. సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి చేరే వరకు సంబంధిత శాఖల పర్యవేక్షణ కీలకం. రూ.6.97 కోట్ల బకాయిల వ్యవహారం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇంతకాలం అధికారులు చేసిన తనిఖీలు ఏమిటి? స్టాక్ రిజిస్టర్లు, మిల్లింగ్ రికార్డులు ఎలా ఉన్నాయి? బకాయిలు ఇంత భారీగా పెరిగే వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మిల్లు సీజ్‌తో వ్యవహారం ముగిసిందా? లేక ప్రభుత్వానికి రావాల్సిన రూ.6.97 కోట్ల బకాయిలను రికవరీ చేసి, బాధ్యులపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటారా? అనేది వేచి చూడాల్సి ఉంది...

# జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టాలి

- ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి:
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

నిర్మల్ జిల్లా, సెప్టెంబర్ 09(మన మీ వార్త న్యూస్)




జిల్లాల్లో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా సమగ్ర చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, వాటిని దశలవారీగా అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి కోసం ప్రతి జిల్లాకు నోడల్ పర్యాటక అధికారిని నియమించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల సహకారం తీసుకోవాలని తెలిపారు. అన్ని పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, ఆహార సదుపాయాలు, రవాణా, మరుగుదొడ్లు, పార్కింగ్, పారిశుద్ధ్యం, సీసీ కెమెరాలు, భద్రత తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆదేశించారు. సందర్శకులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సినిమా చిత్రీకరణకు అనువైన ప్రకృతి, చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను గుర్తించి, వాటిని అవసరమైన సదుపాయాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంతో పాటు, విద్యార్థులకు పర్యాటక రంగంపై వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించాలని తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపడతామని తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంతో పాటు, విద్యార్థులకు పర్యాటక రంగంపై వివిధ పోటీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, వాటి ప్రచారం, మౌలిక వసతుల అభివృద్ధి, సందర్శకుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాథోడ్ రమేష్, డీపీఓ శ్రీనివాస్, డీఐఈఓ పరశురామ్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సాయి జన్ శేఖర్

నాచారం, సెప్టెంబర్ 9 ( మన మీ వార్త):



నాచారం, హెచ్ఎంటీ నగర్ డివిజన్లకు చెందిన పలువురు పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సీఎం కార్యాలయం ద్వారా రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించేందుకు కృషి చేశారు. మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, బన్నెపాక పరశురాం పంపిణీ చేశారు. బన్నెపాక పరశురాంకు రూ.42,000, టి. రేఖకు రూ.37,500, బి. శశిరేఖకు రూ.54,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు.

## కాళోజీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.




ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ఘనంగా నివాళులర్పించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. తన రచనల ద్వారా ప్రజల సమస్యలను, వారి భావాలను ప్రతిబింబించిన మహనీయుడిగా కాళోజీ చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాజిక చైతన్యాన్ని తన రచనల ద్వారా ప్రజల్లో నింపిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాళోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ఆయనకు అందిస్తున్న గొప్ప గౌరవమని తెలిపారు. యువత కాళోజీ సాహిత్యం, ఆయన ఆశయాలను అధ్యయనం చేసి సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డి ఆర్వో విజయలక్ష్మి,డిపియార్వో ప్రేమలత మరియు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుడా కమర్షియల్ ప్లాట్ల బహిరంగ వేలానికి ప్రీ-బిడ్ సమావేశం

– కుడా వైస్ చైర్‌పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో కమర్షియల్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ప్రజల నుంచి ముందస్తు అభిప్రాయాలు, సూచనలు స్వీకరణ నిమిత్తం నేడు (ఈనెల 10వ తేదీన) కుడా కార్యాలయంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు కుడా వైస్ చైర్‌పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
కుడా పరిధిలోని వాణిజ్య స్థలాల బహిరంగ వేలానికి సంబంధించి ఆసక్తిగల ప్రజలు, వ్యాపారులు ప్రీ-బిడ్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని, వైస్ చైర్ పర్సన్ సూచించారు.

## శాయంపేట మండలంలో పలు పాఠశాలలను ఆకస్మిక పరిశీలన చేసిన డిఇఓ

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తేదీ 9 9 2026 హనుమకొండ జిల్లాలోని శాయంపేట మండలంలో నాలుగు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ ఎల్ వి రాజు గౌడ్ ఆకస్మిక పరిశీలన చేశారు. జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాలలు పత్తిపాక మరియు శాయంపేట (బాలికలు) మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు పత్తిపాక మరియు శాయంపేట లలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తరగతి గదిలో ప్రశ్నించడం ద్వారా రాబట్టారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. పత్తిపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కేవలము 22 మాత్రమే ఉండటం వల్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యా కార్యక్రమాలు నిరంతరము చేపట్టి విద్యార్థుల సంఖ్యని పెంచాల్సిందిగా ప్రధానోపాధ్యాయురాలు మాధవిని ఆదేశించారు. విద్యార్థుల సామర్థ్యాలు కూడా తక్కువగా ఉండడాన్ని గమనించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శాయంపేటలో ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరస్ కాంటినెంట్ స్కూల్ గా ఎంపిక అయినందున ఖీంచీ లో సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు జవాబులు చక్కగా ఇచ్చారు.
తరగతి గదిలో విద్యార్థుల విద్య సామర్థ్యాలను జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ బండారి మన్మోహన్ పరిశీలించారు. పాఠశాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వసతులను ముఖ హాజరును జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ బి మహేష్ పరిశీలించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

– పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ:

– అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడాలి:

– రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

నిర్మల్ జిల్లా, సెప్టెంబర్ 09(మన మీ వార్త న్యూస్)





ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ ) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

బుధవారం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవో సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల మేరకు గుర్తించి తొలగించాలని సూచించారు. బీఎల్ఓల వద్ద ఉన్న దరఖాస్తులు, ఓటర్ల జాబితాలను పరిశీలించిన సీఈఓ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబంలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ధ్రువీకరించిన సమాచారం ఆధారంగానే మార్పులు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో డాక్యుమెంట్లను పరిశీలించి అవసరమైన వివరాలను సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.

18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఈఓ సూచించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన ప్రతి వివరాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఎస్ఐఆర్ ప్రక్రియను సీఈవోకి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా దూరమవ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల అభ్యున్నతే మా లక్ష్యం.. వొడితల ప్రణవ్





మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 09

చేనేత కార్మికుల సంక్షేమం, వారి అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం అవుతోంది. ఇందులో భాగంగా చేనేత సెల్ జిల్లా అధ్యక్షులు బండారి సదానందం ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటైన చేనేత సెల్ మండల, పట్టణ కమిటీల సభ్యులకు నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ బాబు నియామక పత్రాలను అందజేశారు. చేనేత సెల్ మండల అధ్యక్షుడిగా కొమటి సదానందం, ప్రధాన కార్యదర్శిగా దాసి సదానందం, టౌన్ అధ్యక్షుడిగా మార్త రవీందర్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా గడ్డం రాఘవేంద్రలు నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి అందేలా చూస్తామని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, పట్టణ అధ్యక్షులు మేకల తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాజీపేట శ్రీనివాస్, సందమల్ల బాబు, చేనేత సంఘం అధ్యక్షులు ఎలిగేటి ఉపేందర్, మండల మహిళా అధ్యక్షురాలు పుల్ల రాధ తదితరులు పాల్గొన్నారు. తమ నియామకానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం, నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ బాబు, చేనేత రాష్ట్ర అధ్యక్షులు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ తదితర సీనియర్ నాయకులకు నూతన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యాటక అభివృద్ధికి మూడేళ్ల కార్యాచరణ

– రూపొందించాలి : రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్

– ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలి

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా ప్రాచీన గ్రంథాలను గుర్తించి డిజిటలైజ్ చేయాలి. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలి పీపీపీ విధానంలో పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలి
పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ప్రతి జిల్లాలో ఉన్న ప్రత్యేక పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి, పర్యాటక రంగ అభివృద్ధికి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టరెట్ నుండి డాక్టర్ సత్య శారద ఈ వీడియో కాన్ఫెరెన్స్ కి హాజరయ్యారు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ మాట్లాడుతూ... ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు. ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక బలాన్ని గుర్తించి, దానికి అనుగుణంగా జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 142 వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలు, ప్రచార కార్యక్రమాలను సమగ్రంగా రూపొందించాలని తెలిపారు. ప్రతి జిల్లాకు మూడు సంవత్సరాల జిల్లా పర్యాటక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి, అందులో ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాలు, అభివృద్ధి చేయాల్సిన ప్రాజెక్టులు, మౌలిక వసతుల అవసరాలు, పెట్టుబడి అవకాశాలు, సందర్శకుల సౌకర్యాలు, ప్రచార కార్యక్రమాలను స్పష్టమైన కాలపరిమితులతో పొందుపరచాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు.
జ్ఞాన భారతం మిషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి సంరక్షించాలని సూచించారు. ప్రతి జిల్లాలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టులపై సమగ్ర సర్వే చేపట్టాలని తెలిపారు.
ప్రాచీన గ్రంథాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా తమ పరిధిలో అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్టుల వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని తెలిపారు. తెలుగు పండితులు, ఉర్దూ పండితులు, ఇతర భాషల నిపుణుల వద్ద ఉన్న ప్రాచీన గ్రంథాల వివరాలను సేకరించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జ్ఞాన భారతం మిషన్ అమలుకు నోడల్ అధికారిని నియమించాలన్నారు.
పీపీపీ ఆధారిత పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏ. వాణి ప్రసాద్ సూచించారు. ప్రతి జిల్లాలో పీపీపీ విధానంలో చేపట్టేందుకు అనువైన పర్యాటక ప్రాజెక్టులను గుర్తించాలని, పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలని తెలిపారు.
ప్రాజెక్టు ప్రతిపాదనలు, సాధ్యాసాధ్యాల నివేదికలు, ఆర్ఎఫ్‌పీలు, ఈఓఐలు సిద్ధం చేసి అవసరమైన అనుమతులు పొందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
ప్రైవేట్ పెట్టుబడిదారులను గుర్తించి, వారితో సమావేశాలు నిర్వహిస్తూ పెట్టుబడులను ఆకర్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములు, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు.
సీఎస్ఆర్ నిధుల సమీకరణ, వివిధ ప్రభుత్వ పథకాల అనుసంధానం ద్వారా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన వనరులను సమీకరించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సూచించారు. గుర్తించిన ముఖ్యమైన, అభివృద్ధి చెందుతున్న పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలు, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది, ఆపరేషన్, నిర్వహణ సిబ్బంది, సైన్‌బోర్డులు, సమాచార కియోస్కులు, శిక్షణ పొందిన స్థానిక గైడ్లు, టికెటింగ్ సౌకర్యం, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు, రహదారులు వంటి సౌకర్యాలను ప్రాధాన్యతా క్రమంలో కల్పించాలని తెలిపారు.
రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాలను గుర్తించి వాటి అభివృద్ధికి రూ.8.45 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
ఆయా వారసత్వ ప్రదేశాలను పర్యాటక ఆకర్షణలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.
జిల్లా పర్యాటక గుర్తింపు, బ్రాండింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏ. వాణి ప్రసాద్ తెలిపారు.
ప్రతి జిల్లాకు ప్రత్యేకమైన పర్యాటక అనుభవాలు, ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను ఫ్లాగ్‌షిప్ డెస్టినేషన్లుగా గుర్తించి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. జిల్లా బ్రాండింగ్‌తో పాటు ఫిల్మ్ టూరిజం, ప్రపంచ పర్యాటక దినోత్సవం వంటి కార్యక్రమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించాలని తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిఆర్వో విజయ లక్ష్మి, ఎడి ఆర్కియాలజీ గంగా, జిల్లా ఇంచార్జ్ టూరిజం శాఖ అధికారి పాల్గొన్నారు.

# వరంగల్, రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- ఎన్నికల అధికారి, అబ్జర్వర్ నియామకం
- జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్య శారద

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలను నిబంధనలకు అనుగుణంగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల నిర్వహణపై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అబ్జర్వర్‌గా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేశ్‌ను, ఎన్నికల అధికారిగా జిల్లా సహకార అధికారి (డీసీఓ) నీరజను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. సభ్యులు, సంబంధిత ప్రజల పరిశీలనార్థం ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయం, వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఉంచినట్లు వారు పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, చేర్పులు, సవరణలకు సంబంధించి నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు.







**ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది**

సెప్టెంబర్ 9 నుండి 14 వరకు ఓటర్ల జాబితా ప్రదర్శన, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుంది. సెప్టెంబర్ 15న ఓటర్ల జాబితాలో చేర్పులు, సవరణల కోసం అభ్యర్థనలు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 16న ఓటర్ల జాబితా పరిశీలన, ఆమోదం కోసం రాష్ట్ర శాఖకు అప్పీళ్లను సమర్పిస్తారు. సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో పాటు ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్‌ను విడుదల చేస్తారు. సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి నామినేషన్‌ను ఇద్దరు అర్హత కలిగిన సభ్యులు ప్రతిపాదించి, సమర్థించాల్సి ఉంటుంది.

ప్రతి నామినేషన్‌కు తిరిగి చెల్లించబడని రూ.10,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.

సెప్టెంబర్ 25న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు.

సెప్టెంబర్ 26న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు.

అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

అవసరమైతే అక్టోబర్ 4, 2026న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేశ్, జెడ్పీ సీఈఓ ఎన్. వసంత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, డీసీఓ నీరజ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ భార్గవ్, ఉపాధి కల్పన అధికారి సాత్విక తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు.

వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితాన్ని చాటే విధంగా “మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం” అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కుడా కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వినాయక చవితి మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని, అదే సమయంలో ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను కూడా గుర్తు చేసే పండుగగా జరుపుకోవాలని అన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా భక్తిని చాటడంతో పాటు చెరువులు, నదులు, నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడవచ్చని తెలిపారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనిక రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన మట్టి గణపతులను ప్రతిష్ఠించేందుకు ముందుకు రావాలని కోరారు. “వినాయకుడిని మట్టితో పూజించి.. అదే మట్టిని ప్రకృతికి తిరిగి అందిద్దాం. మన భక్తి వల్ల ప్రకృతికి హాని కలగకుండా చూసుకోవడం నిజమైన బాధ్యత” అని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే నేటి నుంచే పర్యావరణ పరిరక్షణపై చైతన్యం



పెంపొందించుకోవాలని సూచించారు.

పర్యావరణహితమైన వినాయక చవితి నిర్వహణకు ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూడా ప్రాజెక్ట్ ఆఫీసర్ అజిత్ రెడ్డి, ఈఈ భీమారావు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ అర్హులైన లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందించాలి

- బ్యాంకర్లు, అధికారుల సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ , జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం

జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి బ్యాంకర్లను, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ , జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశంలో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ బ్యాంకర్లు జిల్లాలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించడంతో పాటు అర్హులైన దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలను మరింత ప్రోత్సహించేందుకు బ్యాంకులు చిన్నతరహా వ్యాపారాలు, పరిశ్రమలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలను అందించాలని సూచించారు. ముద్ర రుణాలను అర్హులైన లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. సోలార్ యూనిట్లకు రుణాలను మంజూరు చేయాలన్నారు.

ఆర్సెటీ ద్వారా ఇస్తున్న శిక్షణ కోర్సులను కూడా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో మార్పులు తీసుకురావాలన్నారు.

ఇంతకుముందే మనం పర్యాటక రంగానికి సంబంధించి ఒక ఒప్పందం గురించి చర్చించాం. అందులో భాగంగా పర్యాటక గైడ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి సర్టిఫికెట్ కోర్సులు లేదా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం.






అదే విధంగా హాస్పిటాలిటీ రంగానికి కూడా శిక్షణ కార్యక్రమాలను రూపొందిస్తే బాగుంటుందన్నారు. మడికొండ లో చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అవకాశాలు ఉన్నాయని, మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు.

జిల్లాలో వార్షిక రుణ లక్ష్యంలో భాగంగా మొదటి త్రైమాసికంలో రూ. 2939కోట్లు (33శాతం )లబ్ధిదారులకు బ్యాంకర్ల ద్వారా మంజూరు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో వార్షిక రుణ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు.

ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ విష్ణుప్రియ, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్డీవో మేన శ్రీను, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, మెప్మా పీడీ రాజేశ్వర్,ఆర్బీఐ రీజినల్ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ యశ్వంత్ సాయి, యూబీఐ రీజినల్ హెడ్ కమలాకర్, ఆర్సెటీ డైరెక్టర్ రవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలి

ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన ధ్యేయం - బిఆర్ఎస్ పార్టీ

కోటపల్లి, సెప్టెంబర్ 9( మన మీ వార్త జిల్లా ప్రతినిధి )

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కోటపల్లి మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై నిర్బంధాలు, అరెస్టులు చేయడం సరికాదని ఆయన అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీని ఏకపక్షంగా నిర్వహిస్తూ ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు వంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని నిర్బంధాలు, ఒత్తిళ్లు వచ్చినా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని సోషల్ మీడియా ప్రతినిధిలు ధీమా వ్యక్తం చేశారు.

## స్వచ్ఛ వరంగల్‌కు ఆధునిక సాంకేతికతే బలం

- IFAT India 2026లో పాల్గొన్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న 13వ IFAT India 2026లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న బుధవారం పాల్గొన్నారు.దతెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందంలో భాగంగా పాల్గొన్న కమిషనర్..



పట్టణ నీటి నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, బయోగ్యాస్, ఈ-వేస్ట్ తదితర రంగాల్లోని ఆధునిక సాంకేతికతలు, వినూత్న విధానాలను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసి, వాటిని వరంగల్ నగర అవసరాలకు అనుగుణంగా వినియోగించడం ద్వారా పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, పర్యావరణహిత వరంగల్ నిర్మాణానికి మరింత ఊతమివ్వనున్నట్లు కమిషనర్ తెలిపారు.దIFAT India 2026లో లభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల సూచనలు, జ్ఞాన మార్పిడి కార్యక్రమాలు నగర పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు దోహదపడనున్నాయని కమిషనర్ పేర్కొన్నారు.

## నాయి బ్రాహ్మణ జన సంస్థకు 50 వేల ఆర్థిక సాయం...

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

-మరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం ప్రధాన ఉత్సవంలో ప్రకటించిన పెద్ద కుమార్తె గొట్టిపర్తి నవనీత




..హైదరాబాద్నాయి బ్రాహ్మణ జన సంస్థ ఆధ్వర్యంలో మరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం ప్రధానోత్సవం హనుమాన్ టెక్డిలోని బీసీ భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ జన సంస్థ ప్రధాన కార్యదర్శి, మరియాల లక్ష్మణ్ పెద్ద కుమార్తె గొట్టిపర్తి నవనీత, చిన్న కుమార్తె సుమలత లు ఎన్ జె ఎస్ సంస్థ గౌరవ సలవదారులు డాక్టర్ రాపోలు సుదర్శన్, అధ్యక్షులు శ్రీధర్ లకు 50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నవనీత మాట్లాడుతూ.. మా నాన్న గారి పేరు మీద మరియాల లక్ష్మణ్ స్మారక పురస్కారం ఏర్పాటు చేసి, నగదు పురస్కారం అందిస్తున్న సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. సంస్థకు తాము తమ నాన్న గారి పేరు మీద 50 వేల చెక్కును అందించామన్నారు. ప్రతి సంవత్సరం నాయి బ్రాహ్మణ జన సంస్థ తమ నాన్న గారి పేరు మీద అవార్డు ప్రధానం చేస్తూ ముందుకెళ్లాలని సూచించారు. తమ నాన్నగారు ఎంతో కష్టపడి ఉన్నచ స్థాయికి చేరుకొని నాయి బ్రాహ్మణ సంఘానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. నాయి బ్రాహ్మణులకు ఈరోజు అమలవుతున్న జీవోలు తమ నాన్నగారు సాధించారని తెలిపారు. చిరస్థాయిగా తమ నాన్నగారు నిలవాలని ఉద్దేశంతో తాము నగదును చెక్కు రూపంలో అందించామన్నారు. ప్రతి సంవత్సరం కూడా కొంత సహాయాన్నిఅందిస్తామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి తమ నాన్న గారి పేరు మీద ఉన్న అవార్డును అందజేయాలని సంస్థను కోరారు.

## రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు ఆకారపు అరుణ్ పటేల్ టీం ఘన జన్మదిన శు భాకాంక్షలు





**ఉప్పల్, సెప్టెంబర్ 9 ( మన మీ వార్త):** రాజ్యసభ సభ్యులు శ్రీ అనిల్ కుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలోని యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, పటాకులు పేల్చి ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. అనిల్ కుమార్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ కపర, సాయి కృష్ణ, జయం దినేష్, నవీన్, సాయి, మిట్టు, భాష, అనిల్, శివ తదితర ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అనిల్ కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## న్యూ కాకతీయ మోడల్ హైస్కూల్లో... కరాటే శిక్షణ

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 09



హుజురాబాద్ పట్టణంలోని న్యూ కాకతీయ మోడల్ హైస్కూల్లో గ్లోబల్ శుటోకాన్ కరాటే డు ఇండియా అకాడమీ కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న కరాటే విద్యార్థులతో పాటు రాచపల్లి హేమకు అతిథులుగా పాల్గొన్న బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ జేఏసీ నాయకుడు ఉప్పు శ్రీనివాస్ చేతుల మీదుగా ఎల్లో బెల్ట్ ను బహుకరించినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే మాస్టర్ జలీల్ కరాటే తపస్విగా పిల్లలకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారు రాష్ట్రీయ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు పొందునట్లుగా కృషి చేస్తున్న జలీల్ హుజూరాబాద్ ముద్దుబిడ్డ కావడం చాలా గర్వంగా ఉందని అతనిని అభినందించినారు కరాటే పిల్లల శారీరక దృఢత్వానికి తోడ్పడడంతో పాటు ముఖ్యంగా ఆడపిల్లలకు ఆత్మస్థైర్యాన్ని అందించడానికి ఎంతో తోడ్పడుతుందని అభిప్రాయపడినారు ఈనాటి కాలంలో ప్రతి ఒక్క విద్యార్థి కరాటే విద్యను నేర్చుకొని తమను తాము కాపాడుకోవటంతో పాటు ఇతరులను కూడా కాపాడవలసిన బాధ్యత రేపటి పౌరులైన వారి పైన ఉంటుందని తెలియజేస్తూ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటే విద్యను నేర్పించడానికి ముందుకు రావాలని సూచించినారు

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు సరికాదు

– పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి: మాజీ సర్పంచ్ అజిమెరా తిరుపతి నాయక్

కాసిపేట, సెప్టెంబరు 9: (మన మీ వార్త మండల ప్రతినిధి)



గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులు చేపట్టి ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని అడ్డుకోవడం, ముందస్తు అరెస్టులకు పాల్పడటాన్ని మాజీ సర్పంచ్ అజిమెరా తిరుపతి నాయక్ తీవ్రంగా ఖండించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం సొంత నిధులు వెచ్చించడంతోపాటు అప్పులు చేసి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు, బిల్లులు విడుదల కాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనన్నారు. పెండింగ్ బిల్లులను బకాయిలతో సహా వెంటనే విడుదల చేయాలని, 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచులను ఏకం చేసి ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని తిరుపతి నాయక్ హెచ్చరించారు.

## ఆదర్శ పాఠశాలలో ఘనంగా కాళోజి జయంతి వేడుకలు



చిట్యాల సెప్టెంబర్ 09 (మీవార్త)

చిట్యాల మండల కేంద్రంలోనీ ఆదర్శ పాఠశాల /కళాశాలలో తెలంగాణ రాష్ట్ర భాషా దినోత్సవం సందర్భంగా డాక్టర్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు
ఈ సందర్భంగా పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ మేకుల రమేష్ మాట్లాడుతూ కాళోజి నారాయణ రావు తెలంగాణ రాష్ట్రానికి ఒక అద్భుతమైన అభ్యుదయమైన కవి అని ఆయన జీవితాంతం ప్రజలతోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఆయన రచనలు యువత మదిలో ఉత్సాహాన్ని ఉద్యమ శక్తిని నింపిందని తెలంగాణ రావడానికి ఆయన ముఖ్య కారకులని అన్నారు తెలంగాణ యాస భాష లలో తెలంగాణ ఉద్యమం మొదటి స్థానంలో నిలిచిందని మనది బడి పలుకుల భాష కాదని పలుకు పలుకుబడుల భాష అని నిజాం పరిపాలనలో రజాకార్లకు భయపడకుండా నా తెలంగాణ ఉద్యమమే నా గొడవ అని ఎదురు తిరిగిన గొప్ప మహనీయుడని అన్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నీలం రవీందర్. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా దాగం మల్లేష్

కాసిపేట, సెప్టెంబరు 9 : (మన మీ వార్త మండల ప్రతినిధి)




ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన దాగం మల్లేష్‌ను ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తనకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వానికి, ఎస్సీడబ్ల్యూయూ యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లకు దాగం మల్లేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# జనగామ వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

– ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలి

మన మీ వార్త సెప్టెంబర్ 09 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు కార్యాచరణతో ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం శాంతి కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం కార్యక్రమాలపై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీన వినాయక చవితి పండుగను పురస్కరించుకొని జిల్లాలో మొత్తం (770) చెరువులు ఉన్నాయని, దాదాపుగా జిల్లాలో (2000) గణేష్ ప్రతిమల నిమజ్జనం జరుగుతుందని తెలిపారు.
గణేష్ మండపాల వద్ద రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా గుర్తించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, వీధి లైటింగ్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని డీపీఓకు ఆదేశించారు.
నిమజ్జన ఘాట్‌ల వద్ద భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, సుమారు 12 అడుగుల లోతు వరకు బారికేడింగ్ చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. బోట్లను సిద్ధంగా ఉంచడంతో పాటు ఈతగాళ్ల (స్విమ్మర్స్) బృందాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.
ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ద్వారా సీసీ కెమెరాలు, లైటింగ్, ట్రాఫిక్, నిమజ్జన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.
నిమజ్జన ఘాట్‌లు, మండపాల వద్ద విద్యుత్ భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.
ప్రతి ప్రధాన మండపం వద్ద ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.
రహదారులపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయాలని తెలిపారు.
నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపులపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.
నిమజ్జన ప్రాంతాల్లో వైద్య బృందాలు, అవసరమైన మందులు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మొబైల్ మెడికల్ టీమ్‌లను షిఫ్ట్‌ల వారీగా విధుల్లో ఉంచాలని డీఎంహెచ్ఓకు సూచించారు.
కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు అనుమతించిన డెసిబెల్ పరిమితుల్లోనే సౌండ్ సిస్టమ్‌లు వినియోగించాలని తెలిపారు.
నిమజ్జన ఘాట్‌ల వద్ద భారీ క్రేన్‌లను ఏర్పాటు చేసి, సురక్షితంగా విగ్రహాల నిమజ్జనం నిర్వహించాలని సూచించారు. క్రేన్ ఆపరేటర్లు అప్రమత్తంగా విధులు నిర్వహించే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీఓకు సూచించారు.
జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ టీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు.
విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం చేసేందుకు చెరువుకు వెళ్లే మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్ ఌ బీ, ఈఈ పీఆర్ అధికారులకు సూచించారు.
విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు, విగ్రహాలు నీటిలో సరిగా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
నీటిపారుదల అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు (లేదా) కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో, లేదో పర్యవేక్షించి, మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలన్నారు.
ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు.
అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు.
నిమజ్జనం రెండు రోజులు మద్యం దుకాణాలు తెరవరాదని, అమ్మకాలు చేపట్టరాదని, నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారికి సూచించారు.
డివిజనల్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి, ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించాలని ఆర్డీఓలకు సూచించారు.
జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి శాఖ సమన్వయంతో, బాధ్యతాయుతంగా పని చేయాలని స్పష్టం చేశారు.
అలాగే ప్రతి గణేష్ మండపం వద్ద రాత్రి వేళల్లో ఒక బాధ్యతగల వ్యక్తి తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అగ్నిప్రమాదాలను నివారించేందుకు ప్రతి మండపంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని చెప్పారు.
భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు ఏర్పాటు చేసి క్రమబద్ధంగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని, మహిళలు, వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు.
అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి, అనుమతి పొందాలని సూచించారు.
అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.
తదనంతరం గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను వారు ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (ఫ్రూ) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పూజించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.
మట్టి గణపతుల వినియోగంతో నీటి కాలుష్యం తగ్గడంతో పాటు ప్రకృతి సమతుల్యతను కాపాడవచ్చని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.
ఈ సమన్వయ సమావేశంలో జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, ఘనపూర్ (స్టేషన్), వర్ధన్నపేట ఏసిపిలు భీం శర్మ, నర్సయ్య, మునిసిపల్ కమిషనర్ లు రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, డిపిఓ వెంకట్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ సంపత్ రెడ్డి, డీఎంహెచ్ఓ వాణి శ్రీ, ఆర్టీఓ శిల్ప, ఇతర శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 24 డిమాండ్లపై ఏఐటీయూసీ అగ్రిమెంట్

– కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: వాసిరెడ్డి సీతారామయ్య

కాసిపేట, సెప్టెంబరు 9 : (మన మీ వార్త మండల ప్రతినిధి)



సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం కాసిపేట 1వ గని వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ అధ్యక్షుడు, బొగ్గుగని కార్మికుల వేజ్ బోర్డు సభ్యుడు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు యాజమాన్యంతో చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.సమ్మెకు సంబంధించి కార్మికులను చైతన్యపరిచామని, యాజమాన్యం సమస్యలను పరిష్కరించకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని పెద్దఎత్తున సమ్మె చేపడతామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. దీంతో యాజమాన్యం స్పందించి ఆర్ఎల్‌సీ సమక్షంలో గత నెల 27న హైదరాబాద్‌లో 24 డిమాండ్లపై ఏఐటీయూసీతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు.ఒప్పందంలోని అంశాలను కార్మికులకు పూర్తిగా వివరించి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి సాధించిన పురోగతిని తెలియజేశారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి వి.రాజేందర్, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, చిప్ప నరసయ్య, సీనియర్ నాయకులు బియ్యాల వెంకటస్వామి, బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు, మీనుగు లక్ష్మీనారాయణ, బ్రాంచి కార్యవర్గ సభ్యులు, పిట్ సహాయ కార్యదర్శి పార్వతి సురేష్, షిఫ్ట్ ఇన్‌చార్జీలు చౌడ లింగయ్య, కోళ కమలాకర్, ఐ.సంపత్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ జె.రంజిత్‌కుమార్, ఎస్.అశోక్, గణేష్, బల్లెం శ్రీనివాస్, బియ్యాల రాజన్న, శంకరయ్య, కామెర రాములు, ఎం.సురేష్, ఎం.మహేష్, భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులపై నిత్యం పర్యవేక్షణ చేయాలి

– ఎంపీఓ ఎస్.కె. సప్దర్ అలీ

కాసిపేట, సెప్టెంబరు 9 : (మన మీ వార్త మండల ప్రతినిధి)



వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను నిత్యం పర్యవేక్షించాలని మండల పంచాయతీ అధికారి ఎస్.కె. సప్దర్ అలీ సూచించారు. బుధవారం కాసిపేట మండలంలోని తాటిగూడ, రొట్టెపల్లి గ్రామపంచాయతీలను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించడంతోపాటు పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. మురుగుకాలువలను నిత్యం శుభ్రం చేయించాలని, బ్లైలార్వల్ స్ప్రే, ఫాగింగ్ నిర్వహించాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి సరఫరాకు ముందే క్లోరినేషన్ చేయాలని తెలిపారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుడితో చేయూత పింఛన్లకు దరఖాస్తు చేయించాలని, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో చేపడుతున్న ఆస్తుల మదింపు మొబైల్ నవీకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయించేలా చర్యలు తీసుకోవాలని, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసే విధానాన్ని ప్రోత్సహిస్తూ నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా

# వివిధ కార్యక్రమాలతో తెలంగాణ భాషా దినోత్సవం

**కాసిపేట, సెప్టెంబరు 9 :(మన మీ వార్త మండల ప్రతినిధి)**

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాసిపేట మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కాళోజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ సూచనల మేరకు కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణసింగ్ షేక్ సప్దర్ అలీ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ సహాయకురాలు రాజమణి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనగా
దేవపూర్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ఎస్.సౌమ్య ప్రథమ, ఎస్.మీనాక్షి ద్వితీయ బహుమతులు సాధించగా.. ఉపన్యాస పోటీలో శివాని ప్రథమ, వైష్ణవి ద్వితీయ బహుమతులు పొందారు. సామాజిక చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయుల బోధనలను పాటిస్తూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్య



సలహాదారు మద్దివేని చిన్న భీమయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, చరిత్రకారులు, కవులు, మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకుని స్ఫూర్తి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు రాజేష్, నిర్మల, పద్మకుమారి, మహేష్, రజిత తదితరులు పాల్గొన్నారు.తాటిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మడావి వెంకటేష్ ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ





తెలంగాణ మాండలికానికి, ప్రజల భాషకు కాళోజీ విశిష్టమైన గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తూ కాళోజీ తన కలంతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని పేర్కొన్నారు. మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు, మాజీ ఉపసర్పంచ్ తమ్మినేడి, శ్యామ్‌శేఖర్, బుర్ర ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్లాస్టింగ్ దెబ్బకు బీటలు.. వానకు ఇల్లు కూలింది!

**– కళ్యాణిఖని ఓసీ ప్రభావిత ప్రాంతంలో ఘటన.. తప్పిన పెను ప్రమాదం**

**– ఇళ్లకు పగుళ్లతో బిక్కుబిక్కుమంటున్న గ్రామస్థులు.. నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్**

**కాసిపేట, సెప్టెంబరు 9 : (మన మీ వార్త మండల ప్రతినిధి)**





ఓపెన్‌కాస్ట్ గని బ్లాస్టింగ్ ప్రకంపనలకు ఇళ్ల గోడలకు బీటలు.. ఆపై భారీ వర్షానికి బలహీనమైన ఇల్లు సగభాగం కుప్పకూలిన ఘటన బెల్లంపల్లి మండలం సోమగూడెం(బీ) గ్రామపంచాయతీ పరిధిలోని కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ ప్రభావిత ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. చెట్టి శాంతకు చెందిన ఇంటి సగభాగం ఒక్కసారిగా కూలిపోవడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కూలే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

**బ్లాస్టింగ్ ప్రకంపనలతో బీటలు**

కళ్యాణిఖని ఓపెన్‌కాస్ట్ గనిలో తరచూ నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ కారణంగా తమ ఇంటి గోడలకు కొంతకాలంగా పగుళ్లు ఏర్పడుతున్నాయని బాధిత కుటుంబం తెలిపింది. ప్రకంపనల కారణంగా ఇల్లు క్రమంగా బలహీనపడిందని పేర్కొంది. బుధవారం కురిసిన వర్షంతో ఇంటి నిర్మాణం మరింత బలహీనపడి ఒక్కసారిగా సగభాగం కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటి గోడలు, పైకప్పు ధ్వంసమై కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది.

**కూలే సమయంలో ఎవరూ లేకపోవడంతో..**

ఇంటి సగభాగం కూలిన సమయంలో కుటుంబ సభ్యులు అక్కడ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అదే సమయంలో ఇంట్లో ఎవరైనా ఉండి ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓసీ బ్లాస్టింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్ల పరిస్థితిపై అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టాలని కోరుతున్నారు.



**ఇళ్లు దెబ్బతింటున్నా పట్టించుకోరా?**

ఓపెన్‌కాస్ట్ గనుల బ్లాస్టింగ్ కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గోడలకు పగుళ్లు వచ్చిన ఇళ్లను అధికారులు, సింగరేణి యాజమాన్యం సంయుక్తంగా పరిశీలించి భద్రతా పరిస్థితిని అంచనా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇల్లు కూలిన తర్వాత స్పందించడం కాకుండా.. ముందే ప్రమాదాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

**బాధితులకు తక్షణ సాయం అందించాలి**

కూలిపోయిన ఇంటిని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. ముత్తే భూమయ్య, పొన్నాల కనకరాజు, వార్డు సభ్యులు బాదె ఉమ, జాడి ప్రమీల, మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్, మాజీ ఉపసర్పంచ్ కుక్క రాంచందర్ తదితరులు ఘటనాస్థలిని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

**పునరావాసమే శాశ్వత పరిష్కారం**

ఓసీ విస్తరణ, బ్లాస్టింగ్ ప్రభావంతో ఇళ్లు దెబ్బతింటున్న కుటుంబాల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కేవలం నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోకుండా.. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కూలిన ఇంటి నష్టాన్ని తక్షణమే అంచనా వేసి బాధిత కుటుంబానికి నష్టపరిహారం, అత్యవసర సాయం అందించాలని కోరుతున్నారు. అలాగే ప్రభావిత ప్రాంతంలోని ఇళ్లన్నింటినీ సాంకేతిక నిపుణులతో పరిశీలించి నివేదిక రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పోలీసు సిబ్బందికి గుండె సంబంధ, ఇతర ఆరోగ్య సమస్యలపై మెగా వైద్య శిబిరం

**మీ వార్త సెప్టెంబర్ 9 సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్తీపై హాస్పిటల్ మరియు సూర్యాపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారి సంయుక్త సహకారంతో పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు గుండె, ఇతర ఆరోగ్య సమస్యలపై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ గారు ఇతర ఉన్నతాధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బంది ఎంతో పని ఒత్తిడితో, నిర్విరామంగా విధులు నిర్వహిస్తూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారని అన్నారు. అందుకే పోలీస్ శాఖ వారి సంక్షేమానికి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిత్యం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం అని అన్నారు. పోలీస్ సిబ్బంది అంతా ఒకే కుటుంబమని, ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు, పోలీస్ శాఖలోని హోంగార్డుల నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబం లాంటివారని, సిబ్బంది యోగక్షేమాలు, ఆరోగ్యంపై శాఖ నిరంతరం శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. సమాజ రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా వైద్య



పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబంతో ఆనందంగా గడపడంతో పాటు విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని గుర్తుచేశారు. పోలీసుల సంక్షేమాన్ని గుర్తించి ముందుకొచ్చి ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు, సలహాలు అందించిన ఆర్వీ హాస్పిటల్, హెల్తీపై హాస్పటల్ వైద్య బృందానికి, సూర్యాపేట కెమిస్ట్సు అండ్ డ్రగిస్ట్ పోలీస్ శాఖ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
ఉచిత మెగా వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు సిబ్బందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 580 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు చేయించుకున్నారు
ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డీఎస్పీ లు ప్రసన్న కుమార్, నరసింహ చారి, హెల్తీ పై హాస్పటల్ డాక్టర్ చలపతి రావు, ఆర్వీ హాస్పటల్ కార్డియాలజీ డాక్టర్ ప్రవీణ్ కుమార్, గైనకాలజీ డాక్టర్ ప్రియాంక, ఆర్థోపెడిక డాక్టర్ భరత్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సత్యం, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్ వెల్ఫర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐ లు సురేష్, అన్వర్, అఖిల్, పోలీసు సంఘం అధ్యక్షులు రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సెక్రెటరీ కిరణ్, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్య బృందం, భవాని నర్సింగ్ హోం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అడవిపంది మాంసంతో వ్యక్తి పట్టివేత

**– మరో ఇద్దరిపై అటవీశాఖ కేసు నమోదు**

**కాసిపేట, సెప్టెంబరు 9 :(మన మీ వార్త మండల ప్రతినిధి)**

అడవిపందిని వేటాడి చంపి మాంసాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని అటవీశాఖ అధికారులు పట్టుకున్న ఘటన కాసిపేట మండలం ధర్మారావుపేట సెక్షన్ పరిధిలో చోటుచేసుకుంది. బుగ్గగూడ గ్రామ సమీపంలోని





పత్తిచేనులో అడవిపంది మాంసంతో సంకుర్తల శ్రీకాంత్ పట్టుబడ్డాడు.అటవీశాఖ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీకాంత్ వద్ద అడవిపంది మాంసం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అడవిపందిని వేటాడి చంపినట్లు శ్రీకాంత్ అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. మాంసాన్ని కొనుగోలు చేసేందుకు వచ్చిన శ్రీనివాస్, రంజిత్ అనే మరో ఇద్దరి వివరాలను కూడా వెల్లడించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ముగ్గురిపై సంబంధిత అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి సీహెచ్.పూర్ణచందర్ తెలిపారు. అడవుల్లో వన్యప్రాణుల వేటకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు అటవీశాఖకు సహకరించాలని కోరారు.

## చెక్ పవర్ రద్దు చేయాలని కలెక్టర్‌కు సర్పంచుల వినతి



కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ లు

**శివంపేటమీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ (9):**

ఉపసర్పంచులకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని కోరుతూ శివ్వంపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మురళి గౌడ్ ఆధ్వర్యంలో సర్పంచ్ లు బుధవారం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఫోరం అధ్యక్షుడు బుర్ర మురళీగౌడ్ ఆధ్వర్యంలో సర్పంచులు కలెక్టరేట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుర్ర మురళీగౌడ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల నిర్వహణ,నిధుల వినియోగం,అత్యవసర పనులకు చెల్లింపుల విషయంలో సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.నిధులు ఖర్చు చేసే సమయంలో చెక్ పవర్‌కు సంబంధించిన సాంకేతిక,రాజకీయ సమస్యలతో అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు.గ్రామాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఉపసర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేసి, సర్పంచులకు పూర్తి స్థాయిలో చెక్ పవర్ కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి అయ్యగారి యాదగిరి, కార్యదర్శులు లక్ష్మి దుర్గయ్య నాయక్, నీరుడి మౌనిక మురళీకృష్ణ, కేతావత్ నరేష్,పాంబండ సర్పంచ్ నాయిని సమత వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి వద్ద ఆర్ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రతిపాదనలు

**– త్వరలో పనులు ప్రారంభం: ఎంపీ రఘునందన్‌రావు**

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ (9):**

సిద్దిపేట జిల్లా తూప్రాన్ నుంచి మెదక్ జిల్లా శివ్వంపేట మీదుగా నర్సాపూర్‌కు వెళ్లే సీసీ రహదారిలో బ్రాహ్మణపల్లి లెవల్ క్రాసింగ్ నంబర్ 236ఏ వద్ద ఆర్ఓబీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు.ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం కిరణ్‌కుమార్‌కు అందజేసిన విజ్ఞప్తికి అనుగుణంగా బుధవారం ప్రతిపాదనలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా లెవల్ క్రాసింగ్ నంబర్ 235 వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా సమర్పించినట్లు ఎంపీ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపాదనలపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. రైల్వే కింద నుంచి రోడ్డు మార్గం వెళ్లేందుకు ఆర్‌యూబీ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసినందుకు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




ఆర్ఓబీ,నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని రఘునందన్‌రావు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు ఈ నిర్మాణాలతో పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు.
కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాల్ దాస్ మల్లేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దపులి రవి,సీనియర్ నాయకులు సురేష్,రమేష్, బిక్షపతి,అంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేష్ పరామర్శ

**చిట్యాల సెప్టెంబర్ 9 మీవార్త**

చిట్యాల మండల కేంద్రానికి చెందిన సీనియర్ వార్త రిపోర్టర్ మొగిలి తండ్రి కట్కూరి నరసయ్య ఇటీవలే మృతి క్రితం గుండెపోటుతో మృతి చెందాడు వారి కుటుంబాన్ని బిజెపి మండల అధ్యక్షులు చిట్యాల గ్రామ ఉపసర్పంచి బుర్ర వెంకటేష్ గౌడ్ బిజెపి నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ బిజెపి నాయకులు పెరుమాండ్ల రాజు రాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## జీవో 97 ప్రతిని దహనం చేసిన పాలిటెక్నిక్ విద్యార్థులు: మౌనవ్రతంతో నిరసన




**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ (9):**

జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ గోమారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా జీఓ నంబర్ 97 ప్రతులను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 97 అమలుతో తమ డిప్లొమా విలువపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించి విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాంతియుతంగా నిరసన తెలిపారు.జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేసి సబ్జెక్ట్ వ్యవస్థను కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.తమ భవిష్యత్తుకు సంబంధించిన అంశం కావడంతో ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. గత వారం రోజులుగా తరగతులను బహిష్కరించి నిరసనలు తెలుపుతూ తమ సమయాన్ని విద్యార్థులు వృధా చేసుకోవడం గమనార్హం

## బాలల హక్కుల కమిషన్ గోగుల సరిత లక్ష్మణ్ చందా కేజీబీవీ సందర్శించారు

**లక్ష్మణ్ చంద, సెప్టెంబర్ 9( మన మీ వార్త)**



మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను గోగుల సరిత మరియు సిడిపిఓ అదేవిధంగా డిఈవో లతో కలిసి కేజీబీవీ సందర్శించడం జరిగింది. వారు పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలను, వివిధ కార్యకలాపాలను పరిశీలించారు. సాయంత్రం సమయంలో వారు విద్యార్థులతో జూడో మరియు కరాటే సాధనను గమనించి పిల్లలతో ముచ్చటించడం జరిగింది. కేజీబీవీ లో ఉన్న వంటగది, స్టోర్ రూమ్ మెనూ,కంప్యూటర్ ల్యాబ్ మరియు లైబ్రరీ సౌకర్యాలను కూడా సందర్శించి పరిశీలించారు. పిల్లలకి అందిస్తున్న సౌకర్యాలు మరియు కార్యకలాపాల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

## పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్

**ఫీస్ రియంబర్స్మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలి**

**తహశీల్దార్ కు వినతి పత్రం**

**బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు నూనె అనిల్ యాదవ్**



**రాయపర్తి :** పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి అని రాయపర్తి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ కు ఈ మేరకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ (బీజేపీ ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియ జేయునది 15 వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను చెల్లించకుండా 40లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయడం జరుగుతుంది.రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా విద్యార్థులు గత పన్నెండు ఏళ్ళుగా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని,ఉన్నత చదువులు మధ్యలోనే ఆపివేసి డ్రాపౌట్స్ గమిగిలిపోతున్నారని, స్కాలర్షిప్పులు భిక్ష కాదు ప్రభుత్వ బాధ్యత అని గుర్తెరిగి వెంటనే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేయడం జరేగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవి కిసాన్ మూర్చ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం నరేందర్ జిల్లా నాయకులు కనిగంటి కృష్ణారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల అనిల్ యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెంద్యాల గణేష్ యువమోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ యాదవ్ యూమోర్చ నాయకులు సందీప్ యాదవ్ సిద్దు రాకేష్ శివ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డర్లు వచ్చినా.. కదలని ఉపాధ్యాయులు

**డీఈఓ ఆదేశాలకూ విలువ లేదా?**

**సంఘాల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న విద్యాశాఖ?**



**భీమదేవరపల్లి :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత సమస్య నెలలు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా పలు పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు బోధన ఇబ్బందికరంగా మారింది. కొరత ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించేందుకు జిల్లా, మండల పరిధిలో 248 మందిని వర్క్ అడ్జస్ట్మెంట్ కింద డెప్యూటేషన్ చేసినట్లు సమాచారం.అయితే డెప్యూటేషన్ ఉత్తర్వుల అమలులో జాప్యం జరుగుతుండటంతో సమస్య కొనసాగుతోంది. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరాలు, తమకు అనుకూలమైన ప్రాంతాల్లోనే విధులు కొనసాగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలే జాప్యానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత స్పష్టంగా ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకోకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.చివరికి నష్టపోయేది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు


# బీసీ హాస్టల్ బియ్యం లెక్కల్లో కలకలం...

# బీసీ హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డి సస్పెండ్!

- వార్డెన్ నరేందర్‌రెడ్డిపై కలెక్టర్ కొరడా...తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు!
- 17వ తేదీతో ఆగిపోయిన స్టాక్ రిజిస్టర్!
- స్టోర్‌లో 5.50 క్వింటాళ్ల బియ్యమే!
- 15 క్వింటాళ్ల బియ్యం రసీదు ఎక్కడ?
- 46.34 క్వింటాళ్లకు ఇండెంట్...25 క్వింటాళ్ల రవాణా చిట్!
- రికార్డుల్లో వ్యత్యాసాలపై అధికారుల సీరియస్
- సస్పెన్షన్‌తో సరిపెట్టొద్దు...సమగ్ర విచారణ చేయాలి...బంజారా విద్యార్థి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్
- ఎంఎల్ఎస్ నుంచి హాస్టల్ వరకు బియ్యం లెక్కలు తేల్చాలి...పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్
- అన్ని సంక్షేమ హాస్టళ్లలోనూ తనిఖీలు చేయాలి...బీసీ పొలిటికల్ ఫోరం చైర్మన్ యుగేందర్‌గౌడ్

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో సెప్టెంబర్ 09 మీ వార్త**

వనపర్తి టౌన్ : ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర హాస్టల్‌లో బియ్యం స్వీకరణ, నిల్వలు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణకు సంబంధించి నమోదైన వ్యత్యాసాలు తీవ్ర చర్చకు దారితీశాయి. అధికారిక తనిఖీలో పలు అంశాలు గుర్తించిన నేపథ్యంలో హాస్టల్ వార్డెన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్. నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదర్శ్ సురభి ఐఏఎస్ 8న ఉత్తర్వులు జారీ చేశారు.కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం.వనపర్తి తహసీల్దార్ నిర్వహించిన తనిఖీలో హాస్టల్ రికార్డులు, రిజిస్టర్లు, భౌతికంగా ఉన్న బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వ్యత్యాసాలు నమోదయ్యాయి.



**స్టాక్ రిజిస్టర్ 17వ తేదీతోనే ఆగిపోయింది!**

హాస్టల్ స్టాక్ రిజిస్టర్‌లో 17-08-2026 వరకు మాత్రమే నమోదులు ఉన్నట్లు తనిఖీలో గుర్తించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించలేదని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య, హాజరు, రోజువారీ బియ్యం వినియోగం, మిగులు నిల్వలను తెలుసుకోవడానికి కీలకమైన రికార్డులు నవీకరించకపోవడంపై అధికారులు తీవ్రంగా పరిగణించారు.

**స్టోర్ రూమ్‌లో 5.50 క్వింటాళ్లే!**

అధికారులు హాస్టల్ స్టోర్ రూమ్‌ను భౌతికంగా తనిఖీ చేసినప్పుడు 5.50 క్వింటాళ్ల బియ్యం మాత్రమే అందుబాటులో ఉన్నట్లు నమోదు చేశారు.మరోవైపు టీఎస్ 33 టీ 4074 ట్రక్ చిట్‌లో 25 క్వింటాళ్ల బియ్యం రవాణా చేసినట్లు రికార్డు ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**46.34 క్వింటాళ్ల ఇండెంట్.. 25 క్వింటాళ్ల చిట్!**

హాస్టల్ సమర్పించిన ఇండెంట్‌లో 46.34 క్వింటాళ్ల బియ్యం అవసరం ఉన్నట్లు పేర్కొనగా, ట్రక్ చిట్‌లో 25 క్వింటాళ్ల పరిమాణం నమోదై ఉండటం అధికారుల దృష్టికి వచ్చింది.ఇండెంట్‌లో పేర్కొన్న మొత్తం పరిమాణం ఒకే విడతలో హాస్టల్‌కు అందలేదని విచారణలో నమోదు చేశారు.

**15 క్వింటాళ్ల రసీదు ఎక్కడ?**


ఇక మరో కీలక అంశంగా 13-08-2026న 15 క్వింటాళ్ల బియ్యం అందినట్లు పేర్కొన్నప్పటికీ, దానికి సంబంధించిన రసీదు ఎంట్రీలు/రికార్డులు విచారణ సమయంలో సమర్పించలేదని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.దీనిపై వివరణ కోరగా, తన అభ్యర్థన మేరకే బియ్యం అందిందని హాస్టల్ సంక్షేమ అధికారి మౌఖికంగా తెలిపినట్లు ఉత్తర్వుల్లో నమోదైంది.

**స్టాక్ ఇష్యూ రిజిస్టర్లలో తేడాలు...**

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సమర్పించిన వివరణను అందుబాటులో ఉన్న స్టాక్, ఇష్యూ రిజిస్టర్లతో అధికారులు సరిపోల్చి పరిశీలించారు. ఈ పరిశీలనలో వ్యత్యాసాలు ఉన్నాయని, వివరణ సంతృప్తికరంగా లేదని అధికారులు పేర్కొన్నారు.దీంతో శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు మార్గం ఏర్పడింది.

**కలెక్టర్ కీలక నిర్ణయం...**

తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (సిసిఎ ) రూల్స్--1991లోని రూల్ 8(1), 8(2)(ఎ ) కింద ఉన్న అధికారాలను వినియోగిస్తూ నరేందర్‌రెడ్డిని తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో తెలిపారు.క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో వర్తించే మూల వేతనం, అలవెన్సుల్లో 50 శాతం జీవన భృతిగా చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



**హెడ్‌క్వార్టర్ దాటి వెళ్లొద్దు!**

సస్పెన్షన్ కాలంలో కలెక్టర్ అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని నరేందర్‌రెడ్డిని ఆదేశించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారికి సూచించారు.

**సస్పెన్షన్‌తో విషయం ముగించొద్దు...సమగ్ర విచారణ జరపాలి శివనాయక్...**

వార్డెన్ నరేందర్‌రెడ్డి సస్పెన్షన్‌ను బంజారా విద్యార్థి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ స్వాగతించారు. అయితే సస్పెన్షన్‌తోనే వ్యవహారాన్ని ముగించకుండా హాస్టల్ బియ్యం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, హాజరు రిజిస్టర్, మెస్ రికార్డులను పూర్తిగా పరిశీలించాలి. ప్రభుత్వ బియ్యం విషయంలో తప్పులు నిర్ధారణ అయితే బాధ్యుల నుంచి నష్టాన్ని రికవరీ చేయాలి" అని ఆయన కోరారు.

**ఎంఎల్ఎస్ నుంచి హాస్టల్ వరకు లెక్క తేల్చాలి...పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కుమార్ డిమాండ్**

పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షుడు కే. పవన్‌కుమార్ మాట్లాడుతూ... హాస్టల్‌కు బియ్యం సరఫరా చేసే ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి మొదలుకుని హాస్టల్ స్టోర్ రూమ్ వరకు మొత్తం రికార్డులను క్రాస్ వెరిఫై చేయాలని డిమాండ్ చేశారు.డిస్పాచ్ చిట్,ట్రక్ వివరాలు, డెలివరీ,రిసీవింగ్,స్టాక్,ఇష్యూ,విద్యార్థుల హాజరు అన్నింటినీ సరిపోల్చితే అసలు వ్యత్యాసం ఎక్కడ జరిగిందో తేలుతుందని అన్నారు.

**అన్ని బీసీ హాస్టళ్లను తనిఖీ చేయాలి...బీసీ పొలిటికల్ ఫోరం చైర్మన్ యుగేందర్‌గౌడ్**

బీసీ పొలిటికల్ ఫోరం చైర్మన్ రాచర్ల యుగేందర్‌గౌడ్ మాట్లాడుతూ...ఒక్క హాస్టల్‌లో రికార్డులపై ఇలాంటి అభ్యంతరాలు రావడం నేపథ్యంలో జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్ల రికార్డులను తనిఖీ చేయాలని కోరారు.గత సంవత్సరాల్లో హాస్టళ్లకు కేటాయించిన బియ్యం, ఎంఎల్ఎస్ నుంచి జరిగిన డిస్పాచ్‌లు, హాస్టళ్లలో నమోదైన రిసీవింగ్, స్టాక్, ఇష్యూ వివరాలను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.




**బియ్యం ఎక్కడికి వెళ్లింది?**

విద్యార్థుల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యం విషయంలో ఇండెంట్ ఎంత? డిస్పాచ్ ఎంత? హాస్టల్‌కు చేరింది ఎంత? రిజిస్టర్‌లో ఎంత? విద్యార్థులకు జారీ చేసింది ఎంత? మిగిలింది ఎంత? అనే లెక్కలు స్పష్టంగా ఉండాల్సి ఉంది.ప్రస్తుత ఘటనలో అధికారిక తనిఖీలో రికార్డుల నిర్వహణ, బియ్యం స్వీకరణకు సంబంధించి వ్యత్యాసాలు నమోదవడంతో తదుపరి విచారణపై ఆసక్తి నెలకొంది.

**సరఫరా గొలుసులో ఎక్కడ లోపం?**

ఎంఎల్ఎస్ కేంద్రం నుంచి బయలుదేరిన బియ్యం



హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డి సస్పెండ్

హాస్టల్‌కు చేరే వరకు ప్రతి దశలో రికార్డు ఉండాల్సి ఉంటుంది. ట్రక్ చిట్, డెలివరీ వివరాలు, రిసీవింగ్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, విద్యార్థుల హాజరు వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

**సస్పెన్షన్ తర్వాత అసలు పరీక్ష!**

వార్డెన్ సస్పెన్షన్‌తో ఇప్పుడు తదుపరి శాఖాపరమైన విచారణపై దృష్టి పడింది. రికార్డుల్లో తేడాలకు కారణమేంటి? బియ్యం స్వీకరణలో ఎక్కడ లోపం జరిగింది? బాధ్యత ఎవరిది? అనే అంశాలపై అధికారిక విచారణలో స్పష్టత రావాల్సి ఉంది. విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ సరుకుల విషయంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.సస్పెన్షన్‌తో మొదలైన ఈ వ్యవహారం. సమగ్ర విచారణలో ఎలాంటి వాస్తవాలు వెలుగులోకి తెస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిజెపిలో చేరికలు ,

**డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

**నర్సంపేట :** కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు,నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై నర్సంపేట పట్టణంలోని 23, 24వ వార్డులకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా దేశంలోని కోట్లాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు.నర్సంపేట నియోజకవర్గంలో డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ,ఉచిత వైద్య సేవలు, కంటి వైద్య శిబిరాలు, పేదలకు సహాయం, విద్యార్థులకు చేయూత వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి సుత్రపు సరిత ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాసోజుల బ్రమ్మచారి కి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం కల్పిస్తామని, ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాడుతూ నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తామని అన్నారు.నర్సంపేటలో బీజేపీకి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతోందని, రాబోయే రోజుల్లో మరింత మంది వివిధ పార్టీల నాయకులు,కార్యకర్తలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.ప్రజా సేవే లక్ష్యంగా, అభివృద్ధే ధ్యేయంగా నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తామని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తెలిపారు.బిజెపి పార్టీలో చేరిన వారి పేర్లు 23 వ వార్డ్ నుండి మోటూరి కాశీనాథం,వెంగపండ్ల రాకేష్,పెసరి కార్తికేయ, నాంపల్లి శ్రీనివాస్,24 వ వార్డు నుండి మేకల రవి,కందుకూరి మహేష్ బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బిజెపి ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ జూలూరు రోజా రాణి,బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డపల్లి నరసింహ రాములు,పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, నల్లబెల్లి అధ్యక్షులు తడుక వినయ్,మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు,బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరు మనీష్ గౌడ్,జిల్లా కిసాన్ మోర్చా జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ,బచ్చు వెంకన్న, సీనియర్ నాయకులు కుంభం కోమల్ రెడ్డి,యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాము,పట్టణ నాయకులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు,పొనుగోటి రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ భారీగా విరాళాలు వచ్చాయి. కాంగ్రెస్?తో పోలిస్తే భారీగానే వ్యత్యాసం కనిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి మాత్రమే దాదాపు రూ.1,473 కోట్లు నిధులు వచ్చాయి. కానీ కాంగ్రెస్?కు మాత్రం కేంద్ర, రాష్ట్ర విభాగాలన్నింటినీ కలిపి వచ్చిన ఆదాయం రూ.207 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే బీజేపీకి వచ్చిన మొత్తం నిధులు కాంగ్రెస్ కంటే ఏడు రేట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల్లో ఈ వివరాలు వెల్లడించారు.



**బీజేపీ ఖాతాలో రూ.1,472.8 కోట్లు**

ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. మార్చి 15 నుంచి మే 6 వరకు బీజేపీ కేంద్ర కార్యాలయానికి రూ.1472.8 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఈసీకి సమర్పించిన వివరాల్లో వెల్లడైంది. అయితే కేరళ, బంగాల్ ఎన్నికలకు సంబంధించిన బీజేపీ ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు. ఆయా రాష్ట్రాల వివారలు కూడా కలిపితే పార్టీ మొత్తం ఆదాయం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎన్నికల ప్రారంభంలో మార్చి 15న బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాల్లో సుమారు రూ.6,722.6 కోట్లు ఉన్నాయి. మే 6 నాటికి ఆ మొత్తం రూ.7,627.2 కోట్లకు చేరింది. అంటే ఎన్నికల వ్యవధిలోనే కేంద్ర కార్యాలయ నిధుల్లో రూ.904.6 కోట్ల పెరుగుదల నమోదైంది.

**కాంగ్రెస్ నిధుల్లో తగ్గుదల**

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల సమయంలో ఆర్థిక పరిస్థితి భిన్నంగా కనిపించింది. ఐదు రాష్ట్రాల పార్టీ విభాగాలు, కేంద్ర కార్యాలయాన్ని కలిపి ఎన్నికల ప్రారంభంలో సుమారు రూ.169.06 కోట్లు ఉన్నాయి. ఇందులో రూ.22.9 కోట్లు నగదు రూపంలో, రూ.146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయి. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ మొత్తం సుమారు రూ.103.2 కోట్లకు తగ్గింది. అంటే ఎన్నికల కాలంలో కాంగ్రెస్ నిధుల్లో దాదాపు రూ.65.86 కోట్ల క్షీణత నమోదైంది.

**బీజేపీ ఖర్చు ఎక్కడెంత?**

ఇప్పటివరకు బహిర్గతమైన బీజేపీ వ్యయ వివరాల ప్రకారం, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిల్లో సుమారు రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.130.4 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, మిగిలిన మొత్తం అభ్యర్థులు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించింది. అసోంలో బీజేపీ అత్యధికంగా రూ.96.27 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.76.73 కోట్లు పార్టీ సాధారణ ప్రచారానికి, రూ.19.54 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చయ్యాయి. సాధారణ ప్రచార వ్యయంలో ప్రకటనలకు దాదాపు రూ.37 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.27.3 కోట్లు ఖర్చయ్యాయి. ఇక తమిళనాడులో బీజేపీ రూ.51.56 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.44.51 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.7.05 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. మీడియా ప్రకటనలకు సుమారు రూ.23.96 కోట్లు, స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణానికి రూ.10.04 కోట్లు ఖర్చు చేసింది. ప్రచార సామగ్రికి మరో రూ.5.85 కోట్ల వరకు వెచ్చించింది. పుదుచ్చేరిలో బీజేపీ మొత్తం రూ.11.90 కోట్ల ఎన్నికల వ్యయాన్ని చూపించింది. ఇందులో రూ.9.19 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.2.71 కోట్లు అభ్యర్థులకు సంబంధించిన ఖర్చులకు వెళ్లాయి.

**కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు రూ.248.55 కోట్లు**

ఇక కాంగ్రెస్ ఐదు రాష్ట్రాల్లో కలిపి రూ.248.55 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ పార్టీ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం ఖర్చు చేసింది. కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఐదు రాష్ట్రాల్లో సాధారణ ప్రచారానికి రూ.40.52 కోట్లు ఖర్చు చేయగా, రాష్ట్ర, స్థానిక విభాగాలు మరో రూ.102.49 కోట్లు వెచ్చించాయి. ఈ వ్యయంలో కేరళ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ సాధారణ ప్రచారానికి రూ.59.28 కోట్లు ఖర్చు చేసింది. అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.

# భారత్, రష్యా రక్షణ ఒప్పందం

భారత్- రష్యా మధ్య ఉన్న వ్యూహాత్మక రక్షణ బంధం మరో సరికొత్త మలుపు తిరగబోతోంది. దిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ఈ నెల 11న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అత్యంత కీలకమైన ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఈసారి అజెండాలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవే ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ, అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్. ఈ రక్షణ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఆసియా ఖండంలో భారత్ రక్షణ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.



**ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ**

మిలిటరీ-టెక్నికల్ సహకారమే ప్రధాన అజెండాగా ఈ చర్చలు సాగనున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ చేసిన తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి ప్రధాన అంశం. ఎస్-400 ట్రయంఫ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ డెలివరీ. శత్రు దేశాల నుంచి దూసుకొచ్చే విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిస్సైల్లను గాలిలోనే పసిగట్టి నిర్వీర్యం చేయగల శక్తివంతమైన వ్యవస్థ ఇది. 2018లో రష్యాతో భారత్ 5.43 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదు వ్యవస్థలను కొనుగోలు చేయగా, ఇప్పటికే మూడు భారత్‌కు చేరాయి. భారత వాయు రక్షణలో కీలకమైన ఈ ఎస్-400 సిస్టమ్స్ తదుపరి రెండు యూనిట్లను 2026 నాటికి పూర్తి స్థాయిలో సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని రష్యా తాజాగా ప్రకటించింది. రక్షణ కొనుగోళ్ల మండలి కూడా అదనపు వ్యవస్థల కొనుగోలుకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో ఈ డెలివరీలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

**'సుఖోయ్-57' స్టెల్త్ ఫైటర్ జెట్**

ఇక ఈ భేటీలో అత్యంత వ్యూహాత్మకమైన, ఆసక్తికరమైన అంశం, రష్యాకు చెందిన ఐదో తరం 'సుఖోయ్-57' (సుఖ-57) స్టెల్త్ ఫైటర్ జెట్. శత్రు రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించగల ఈ అధునాతన యుద్ధ విమానాన్ని భారత్‌కు విక్రయించేందుకు రష్యా గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వ్యూహం ఇక్కడ భిన్నంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా కేవలం కొనుగోలు దారుడిగా మిగిలిపోకుండా, టెక్నాలజీ బదిలీ జరగాలని భారత్ పట్టుబడుతోంది. ఆధునిక రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్, సెన్సార్ ఇంటిగ్రేషన్ ఇంజిన్ తయారీ వంటి అత్యంత సున్నితమైన సాంకేతికతను పంచుకోవడంపై ఇరు దేశాల శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే, దేశీయ ఉత్పత్తి రంగంలో భారత్ ఒక భారీ ముందడుగు వేసినట్లే.

**బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్**

ఈ అజెండాలో ముచ్చటగా మూడో కీలక అంశం, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అప్‌గ్రేడ్. భారత్, రష్యాల ఉమ్మడి రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి ఈ క్షిపణి ఒక పర్ఫెక్ట్ ఉదాహరణ. ఇప్పటికే భూ, జల, వాయు మార్గాల నుంచి ప్రయోగించేలా బ్రహ్మోస్ సక్సెస్ అయింది. ఇప్పుడు దీని రేంజ్, ఫీచర్లను పెంచి మరింత ఆధునీకరించాలని రష్యా కోరుతోంది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయ డిఫెన్స్ మార్కెట్‌లో బ్రహ్మోస్‌ను ప్రధాన ఆకర్షణగా మార్చాలనేది ఇరు దేశాల ప్లాన్. ఇప్పటికే పలు దేశాలకు బ్రహ్మోస్ ఎగుమతులు ప్రారంభమైన నేపథ్యంలో, ఈ కొత్త అప్‌గ్రేడ్ భారత్‌ను గ్లోబల్ డిఫెన్స్ ఎగుమతిదారుగా ఒక మెట్టు పైకి ఎక్కిస్తుంది. దశాబ్దాలుగా రష్యా అంటే భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి కూడా భారత్ భారీగా రక్షణ ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో రష్యా తన పాత పద్ధతులను మార్చుకుంటోంది. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, పాశ్చాత్య దేశాల ఆంక్షల నడుమ భారత్ లాంటి నమ్మకమైన భాగస్వామిని మరింత చేరువ చేసుకునేందుకు, ఏకంగా సాంకేతికతనే పంచుకోవడానికి రష్యా సిద్ధపడటం విశేషం. పాత ఆయుధాల స్థానంలో జాయింట్ ప్రొడక్షన్, కొత్త టెక్నాలజీ, దేశీయ తయారీ ఇవే భవిష్యత్ భారత్-రష్యా రక్షణ బంధానికి పునాది కానున్నాయి. అందుకే ఈ సెప్టెంబర్ 11న జరిగే సమావేశం, భారత భద్రతా ముఖచిత్రాన్ని మార్చే కీలక ఘట్టంగా మారబోతోంది.

# ఈవీల కోసం ఎగబడుతున్న జనం

**ముంబై :** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది.అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం.ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది.త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి "సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్" అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విడుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలోని అవినీతి' అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. "న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**అసలేంటి వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన 'ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)' అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

**సవరించిన పాఠ్య పుస్తకం**

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. 'స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?' అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి 'న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా 'న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

**ముగిసిన కేసు**

కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

## బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా - ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

**'దైవ లీల'గా ప్రచారం**

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది.ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

# ఆ రెండూ కుట్రలే!

-మొదటిపేజీ తరువాయి

విచారణాధికారిగా నియమిస్తున్నట్టు వెల్లడించారు. బుధవారం శాసనసభలో సీఎం ఈ మేరకు ప్రకటన చేశారు. కేసీఆర్ నివాసం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్లిన దళితులను అవమానించేలా ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసినట్టుగా చెబుతున్న వ్యవహారంపై బుధవారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ చర్చను ముగిస్తూ ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు.

### కోర్టులు బెయిల్ ఇచ్చినా ప్రజలు బెయిల్ ఇవ్వరు

'చట్టాలు, సెక్షన్లను అడ్డుపెట్టుకుని కొంతమంది కోర్టుల నుంచి బెయిల్ పొందవచ్చు. కానీ తెలంగాణ సమాజం మాత్రం వారికి బెయిల్ ఇవ్వదు. జరిగిన తప్పును అంగీకరించి క్షమాపణ చెబితే కిరీటం ఊడిపోతుందా? స్థాయి తగ్గుతుందా? సభాపతిని అవమానించిన విషయంలో ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరిస్తుంది. చట్టపరంగా శిక్షించే వరకు వెనక్కి తగ్గబోదు. సభాపతి పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌కుమార్ మనసుకు గాయం చేసేలా ఉన్మాదంతో వ్యవహరించిన వారిని వదిలే ప్రసక్తే లేదు. వ్యక్తినే కాకుండా తల్లిని కూడా అవమానించే స్థాయికి వెళ్లారు. మహిళలను శక్తిగా కొలిచే సమాజంలో ఇలాంటి చర్యలకు చోటుంటుందా? సభలో అధికారులపై దాడులు చేయడంతోపాటు స్పీకర్ కుర్చీని అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.



### దళితులపై అవమానకర చర్యలు

స్పీకర్‌ను అవమానించిన ఘటనకు నిరసనగా కొంతమంది ప్రజాస్వామ్యవాదులు ఫామ్‌హౌస్ వద్ద డప్పు దరువులతో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపారే తప్ప ఎలాంటి ఉన్మాదానికీ పాల్పడలేదు. దళిత సోదరులు తమ మనసులోని భావాలను వ్యక్తం చేసేందుకు డప్పును ఒక సాధనంగా ఉపయోగిస్తారు. నిరసన తెలిపిన దళిత ప్రతినిధులను పిలిచి మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉంది. కానీ అందుకు భిన్నంగా వ్యవహరించి, దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించడం ద్వారా దళితనులను తీవ్రంగా అవమానించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తే.. మరి దొరతనం, ఆహంకారంతో ఉన్న ఆ నేతల మనసుల్లో పేరుకుపోయిన అంటరానితన భావజాలాన్ని ఎలా శుద్ధి చేస్తారు? యాసిడ్‌తో కడగాలా? దళితుడు దుక్కి దున్ని పంట పండిస్తేనే అందరి కడుపులు నిండుతున్నాయి. మనకు అన్నం పెడుతున్న వారిని ఇంతగా అవమానిస్తారా? దళితులను అవమానపరుస్తూ వారిని కించపరిచిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలి. అప్పుడే వారికి దళితులు ఎదుర్కొంటున్న వివక్ష ఎలాంటిదో తెలిసొస్తుంది.

### ఖర్గేనూ అవమానించారు..

సమాజంలో అశాంతిని ప్రోత్సహించి రెండు వర్గాల మధ్య వైరాన్ని పెంచాలని ప్రయత్నిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవారు ధనబలంతో వ్యవస్థలను లొంగదీసుకోవాలని చూస్తున్నారు. మేము మాత్రం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉన్నాం. కాంగ్రెస్ పార్టీ దేశంలోని కోట్లాది ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించింది. కర్ణాటకలోని ఓ చిన్న గ్రామంలో పుట్టి, రజాకార్ల దాడుల్లో తల్లిని కోల్పోయి, కార్మిక నాయకుడిగా ఎదిగి జాతీయ స్థాయికి చేరుకున్న నేత మల్లికార్జున ఖర్గేను అవమానించడం బాధాకరం. ఉత్తరాఖండ్‌లోని ఓ మైదానంలో ఖర్గే సభలో పాల్గొన్న అనంతరం ఆగస్టు 10న బీజేపీ అనుబంధ సంస్థ అదే మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడం హేయమైన చర్య. ఆ ఘటనను ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది. తాజాగా తెలంగాణ వేదికగా బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వ్యవహారానికి తెరలేపింది.

### వారిని వదిలే ప్రసక్తే లేదు..

విద్యా రంగంలోని అక్రమాలు, ధరణి అక్రమాలు, 22ఏ రాద్ధాంతంపై శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం భావించింది. ఈ అంశాలపై చర్చ జరిగితే గత పదేళ్లలో జరిగిన దురాగతాలు, రాష్ట్రంపై పేరుకుపోయిన అప్పుల గురించి ప్రజలకు అవగాహన కలుగుతుందనే భయంతోనే చర్చను అడ్డుకునేందుకు ఈ కుట్రలు పన్నారు. సభను అడ్డుకోవడమే కాకుండా స్పీకర్‌ను అవమానించే స్థాయికి వెళ్లడం అత్యంత దురదష్టకరం. కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించింది. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి బాటలు వేసింది. కాంగ్రెస్ విధానం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించడమే..' అని సీఎం స్పష్టం చేశారు. స్పీకర్ మనసును గాయపరిచిన వారిని వదిలే ప్రసక్తి లేదని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే విషయంలో ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.


# ఫ్యూచర్ సిటీకి సిక్స్ లైన్స్ రోడ్

**హైదరాబాద్ :** భారత్ ఫ్యూచర్ సిటీకి కీలకమైన రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారిని నిర్మిస్తున్నారు. రెండు విడతల్లో చేపడుతున్న ప్రాజెక్టుకు మొత్తం రూ.4,621 కోట్ల వ్యయం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరో నాలుగు లైన్ల విస్తరణకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20 మీటర్ల స్థలాన్ని రిజర్వు చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి రవాణా, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీకి రాజమార్గం రెడీ అవుతోంది. రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రేడియల్ రోడ్డు-1లో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మార్గమధ్యంలో ఉన్న చిన్నచిన్న కొండలను తొలగిస్తూ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిపనులు చేపడుతున్నారు. అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు ఆమన్‌గల్లు వరకు 41.5 కిలోమీటర్ల పొడవున ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల యాక్సెస్ కంట్రోల్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 100 మీటర్ల వెడల్పుతో నిర్మించే ఈ మార్గం భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందుతోంది.ప్రస్తుతం ఆరు లైన్ల రహదారిని నిర్మించనుండగా.. భవిష్యత్తులో మరో నాలుగు లైన్లను విస్తరించేందుకు వీలుగా ప్రణాళిక రూపొందించారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన భూసేకరణ చేపడుతున్నారు. ఈ రహదారి పూర్తయితే ఓఆర్ఆర్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య అనుసంధానం బలోపేతం కావడంతో పాటు ఫ్యూచర్ సిటీకి వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి.ప్రాజెక్టును రెండు విడతల్లో చేపడుతున్నారు. తొలివిడతలో రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నారు. కొంగర్‌ఖుర్ద్, ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. తొలి విడత నిర్మాణానికి రూ.1,911 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్లు వరకు 22.3 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కుర్మిద్ద, కడ్తాల్, ఆకుతోటపల్లి, ఆమన్‌గల్లు ప్రాంతాల మీదుగా ఈ మార్గం సాగుతుంది. రెండో విడత కోసం రూ.2,710 కోట్ల వ్యయం చేయనున్నారు. రెండు విడతల పనులను రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ సంస్థలు చేపడుతున్నాయి.రహదారి మధ్యలో భవిష్యత్తులో మెట్రో లేదా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసేందుకు 20 మీటర్ల స్థలాన్ని ప్రత్యేకంగా రిజర్వు చేయడం ప్రాజెక్టులో మరో కీలక అంశం. దీంతో భవిష్యత్‌లో ప్రజా రవాణా వ్యవస్థను ఈ కారిడార్‌తో అనుసంధానించేందుకు అవకాశం ఉంటుంది. ఎక్స్‌ప్రెస్‌వేకు ఇరువైపులా మూడు లేన్ల సర్వీస్ రోడ్లు, రెండు మీటర్ల గ్రీన్‌బెల్ట్, మూడు మీటర్ల వెడల్పుతో సైకిల్ ట్రాక్, రెండు మీటర్ల ఫుట్‌పాత్, రెండు మీటర్ల యుటిలిటీ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఇది కేవలం వాహనాల రాకపోకలకు మాత్రమే కాకుండా పాదచారులు, సైక్లిస్టులు, స్థానిక రవాణాకు కూడా ఉపయోగపడే సమగ్ర రహదారి వ్యవస్థగా రూపుదిద్దుకోనుంది.రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే భారత్ ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ నగరానికి అనుసంధానం మరింత మెరుగుపడనుంది. రహదారి వెంట పారిశ్రామిక, వాణిజ్య, నివాస అభివృద్ధికి ఊతం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా వేగవంతమైన రవాణా సదుపాయాలతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు బిగ్ బూస్ట్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



# కాంగ్రెస్‌లో రేవంత్‌కు ఫుల్ పవర్స్

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తే ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, మీడియా ముందుకు వచ్చి సొంత పార్టీ నేతలపై లేదా ప్రభుత్వంపై అసంతృప్తి వెళ్లగక్కడం కాంగ్రెస్‌లో చాలా కాలంగా నడుస్తున్న సంస్కృతి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు టీపీసీసీ డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చర్యలకు శ్రీకారం చుట్టింది. నాగార్జునసాగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ, కమిటీ ఛైర్మన్ మల్లు రవి నేతృత్వంలో వరుసగా నోటీసులు ఇస్తూ అసంతృప్తులకు చెక్ పెడుతున్నారు.ఇటీవలే ఒకే రోజు ఏకంగా తొమ్మిది మంది కీలక నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గాంధీ భవ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇందులో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాన్వాయ్‌పై దాడి ఘటనకు సంబంధించి ఐదుగురు స్థానిక నేతలకు నోటీసులు ఇవ్వగా.. గజ్వేల్‌లో ఘర్షణలలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డిలకు నోటీసులు వెళ్లాయి. ఆదిలాబాద్ వివాదంలో కంది శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్ రెడ్డిల వివరణ కోరారు. ఎంతటి సీనియర్ నేతలైనా సరే, బహిరంగ వివాదాలకు దిగితే సహించేది లేదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారుఈ కఠిన వైఖరి వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వానికి ఢిల్లీ అధిష్టానం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా కేబినెట్ విస్తరణ అంచనాల వేళ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్లు ఘాటు వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఆ తర్వాత సీఎం సమావేశాల్లో పాల్గొని లైన్‌లోకి రావడం ద్వారా ఒక స్పష్టమైన సంకేతం వెళ్లింది. తిరుగుబాటు స్వరాలు వినిపిస్తే మంత్రి పదవులే కాదు, పార్టీలో ఉనికికే ప్రమాదమనే విషయాన్ని ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్టానం ప్రాక్టికల్‌గా రుజువు చేసింది.ఇకపై ఎవరూ నోరెత్తకుండా రేవంత్ రెడ్డి చెప్పినట్లే వింటారా? అనే కోణంలో చూస్తే.. ఇది కేవలం రేవంత్ రెడ్డి ఏకపక్ష నిర్ణయం మాత్రమే కాదు. అధిష్టానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్ మార్గదర్శకంలోనే మల్లు రవి ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ క్రమశిక్షణను కాపాడే బాధ్యతను రేవంత్ రెడ్డి-పీసీసీలకే అప్పగించడంతో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ పార్టీ గీత దాటితే చర్యలు ఖాయమని అర్థమైపోయింది. కాంగ్రెస్ లాంటి కల్చర్ ఉన్న పార్టీలో అసమ్మతిని నూటికి నూరు శాతం అణచివేయడం సులభం కాకపోయినా, ఈ కఠిన నిర్ణయాల వల్ల తాత్కాలికంగానైనా నేతలు సైలెంట్ అయ్యే అవకాశం ఉంది. రాబోయే స్థానిక పోరులో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి టీమ్ ముందుకు సాగుతున్న తరుణంలో, ఈ క్రమశిక్షణా అస్త్రం పార్టీ శ్రేణుల్లో ఐక్యతను తీసుకొస్తుందో లేదో వేచి చూడాలి.




## కోహెడ'కు రూ.637.70 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో 178.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశలో భాగంగా ఆరు వేలం హాళ్లు, వాటికి అనుబంధంగా మీజనైన్ ఏసీ అంతస్తులు నిర్మించనున్నారు. వీటితోపాటు షెడ్--4, కర్బూజ తదితర పండ్ల విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్, రైతుల కోసం కిసాన్ రిటైల్ మార్కెట్, వాహనాలు నేరుగా లోపలికి వెళ్లి సరుకులు తరలించే సదుపాయం, ప్రాంగణం వెలుపల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. మార్కెట్ నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) ద్వారా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాంకేతిక అనుమతులు, టెండర్ల ప్రక్రియ, నిర్మాణ పనుల పర్యవేక్షణ తదితర బాధ్యతలను ఆ శాఖ నిర్వహించనుంది.

### రైతులకు ఆధునిక సదుపాయాలు

ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే పండ్ల ఉత్పత్తిదారులకు ఆధునిక మార్కెటింగ్ మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పండ్ల విక్రయాలు, నిల్వ, రవాణా, మార్కెటింగ్‌కు మెరుగైన సదుపాయాలు కల్పించనున్నారు. తద్వారా రైతులకు మార్కెట్ అవకాశాలు పెరగడంతో పాటు మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, మార్కెటింగ్ వ్యవస్థ ఆధునీకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కోహెడ సమగ్ర పండ్ల మార్కెట్ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ రంగంలో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

-మొదటిపేజీ తరువాయి

మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. "మేం సభలో అందరు ఉండాలని కోరుకునే వాళ్లం అధ్యక్ష. సభలో జరిగే చర్చల్లో పాల్గొని సూచనలు ఇస్తే తీసుకుంటాం. మేం ఎంత చెప్పిన దాదాపు గంటసేపు నుంచి వారు వినడం లేదు. అదే విధంగా సభను అడ్డుకుంటున్న తరుణంలో బీఆర్?ఎస్? సభ్యులను ఈ సెషన్?నుంచి సస్పెండ్ చేయాలని కోరుతున్నా"

### సభ సజావుగా నడిచేలా

సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు.

### న్యాయం కావాల్సింది బలహీనవర్గాలకు

నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్?ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

## శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

-మొదటిపేజీ తరువాయి

హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు.

### తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం

పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. "శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు.పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లాం"

## సర్కార్ వారి రైడింగ్ యాప్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమీషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమీషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలపై చర్చించారు. డ్రైవర్లతో పాటు ఇతర కార్మికుల భద్రత కోసం ఇన్స్యూరెన్స్ పాలసీని అమలు చేయడంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రభుత్వం తరపున ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అత్యంత తక్కువ ధరల్లో ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందిస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు కమిషన్ల భారం కూడా తగ్గి వారికి ప్రయోజనం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని, ప్రస్తుతం పెంచేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఆటో కార్మికుల సంఘాలు, రవాణశాఖ అధికారులతో ఛార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎంత పెంచాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పించనుందని, ఆ నివేదిక పరిశీలించాక ఎంత పెంచాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.



# బాలయ్య-కొరటాల మూవీలో ఇద్దరు ఐశ్వర్యలు.. మేకోవర్ చూస్తే షాకే!


గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దేవర' తర్వాత కొరటాల శివ రూపొందించనున్న ఈ చిత్రం బాలయ్య కెరీర్‌లో మరో ప్రత్యేకమైన సినిమాగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పలు ఆసక్తికరమైన వార్తలు ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా బాలకృష్ణ ఈ సినిమాలో ఇప్పటివరకు చూడని సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారనే టాక్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణను మాస్ యాక్షన్ హీరోగా అద్భుతంగా ప్రెజెంట్ చేయడంలో దర్శకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంటారు. అయితే కొరటాల శివ మాత్రం ఈసారి బాలయ్యను కేవలం మాస్ యాంగిల్‌కే పరిమితం చేయకుండా.. ఆయన పాత్రలో కొత్త షేడ్స్‌ను చూపించనున్నారని టాక్ వినిపిస్తోంది. సామాజిక అంశాలు, కుటుంబ భావోద్వేగాలను కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మేళవించడం కొరటాల శివ శైలి. ఈ సినిమాలోనూ అదే తరహాలో యూనివర్సల్ ఎమోషన్‌తో కూడిన కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ భారీ చిత్రానికి సంబంధించిన తొలి షూటింగ్ షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అయితే మొదటి షెడ్యూల్‌లో బాలకృష్ణ పాల్గొనరనే టాక్ వినిపిస్తోంది.బాలయ్య లేకుండా కీలకమైన సన్నివేశాలతో పాటు భారీ యాక్షన్ ఎపిసోడ్లను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది.దాదాపు 15 రోజుల పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే విషయంపై కొంతకాలంగా ఆసక్తి కొనసాగుతోంది. తాజాగా మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి పేరును దాదాపు ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.వైద్యురాలిగా పనిచేసిన ఐశ్వర్య లక్ష్మి.. నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చి మలయాళం, తమిళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు'లోనూ ఆమె కీలక పాత్రలో కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ సరసన నటించే అవకాశం దక్కితే ఆమె కెరీర్‌కు ఇది మరో కీలక మలుపుగా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ సినిమాలో మరో కీలకమైన పాత్ర కోసం నటి ఐశ్వర్య రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. ఆమెను రెగ్యులర్ హీరోయిన్ పాత్రలో కాకుండా లేడీ విలన్‌గా సరికొత్త నెగెటివ్ షేడ్‌లో చూపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే హీరోయిన్, లేడీ విలన్ పాత్రలకు సంబంధించిన ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





# రామాయణకు గాడ్జిల్లా మైనస్ జీరో దెబ్బ

## ఐమ్యాక్స్ స్క్రీన్ల కోసం గ్లోబల్ వార్




ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో 'రామాయణ: పార్ట్ 1' ఒకటి. భారతీయ పురాణ ఇతిహాసం రామాయణాన్ని అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, యష్ రావణుడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా విజువల్ గ్రాండియర్‌గా తెరకెక్కుతోంది. నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.అదే తేదీన జపాన్‌కు చెందిన మరో భారీ చిత్రం 'గాడ్జిల్లా మైనస్ జీరో' కూడా అంతర్జాతీయ మార్కెట్లలోకి రాబోతోంది. 'గాడ్జిల్లా మైనస్ వన్'కు కొనసాగింపుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తకాషి యమజాకి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. దీంతో రామాయణ--గాడ్జిల్లా మధ్య పోటీ ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రెండు పెద్ద సినిమాలు ఒకే రోజు విడుదలైతే థియేటర్లు, ఆడియెన్స్, బాక్సాఫీస్ వసూళ్ల కోసం పోటీ ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది. కారణం.. రెండు సినిమాలూ ప్రీమియం ఐమ్యాక్స్ అనుభూతిని దృష్టిలో పెట్టుకుని రూపొందిన భారీ విజువల్ చిత్రాలు కావడమే. ముఖ్యంగా 'గాడ్జిల్లా మైనస్ జీరో'ను జపాన్‌లో ఐమాక్స్ కోసం ప్రత్యేకంగా చిత్రీకరించిన తొలి జపనీస్ ప్రొడక్షన్‌గా అధికారికంగా ప్రచారం చేస్తున్నారు. ఐమాక్స్ స్క్రీన్లపై విజువల్స్, సౌండ్‌ను మరింత విస్తృతంగా ఆస్వాదించేలా సినిమాను రూపొందించినట్లు చిత్రబృందం చెబుతోంది.ఇక 'రామాయణ' కూడా ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో.. ముఖ్యంగా నార్త్ అమెరికా వంటి ఓవర్సీస్ మార్కెట్లలో ఐమాక్స్ స్క్రీన్ల కేటాయింపు కీలకంగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. 'గాడ్జిల్లా మైనస్ జీరో' తాజా ట్రైలర్ విడుదలైన తర్వాత ఈ పోటీపై చర్చ మరింత పెరిగింది. ట్రైలర్‌లో భారీ విజువల్స్, గాడ్జిల్లా విధ్వంసం, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను ఆకట్టుకునేలా కనిపించడంతో సినిమాపై అంతర్జాతీయంగా ఆసక్తి పెరుగుతోంది.

# రూ.200 కోట్ల 'ఇరుముడి' ఓటీటీలోకి..

## రవితేజ బ్లాక్‌బస్టర్ ఎక్కడ, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అంటే?

ఓటీటీ ప్రేక్షకులకు అదిరిపోయే గుడ్‌న్యూస్. థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సత్తా చాటింది. ముఖ్యంగా రవితేజను మాస్ హీరోగా మాత్రమే కాకుండా ఒక బలమైన ఎమోషనల్ నటుడిగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ఇప్పుడు థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరుముడి'ని తెరకెక్కించారు. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ పబ్లిక్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు స్థిరంగా కొనసాగాయి. ఇతర సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ.. 'ఇరుముడి' మాత్రం సుదీర్ఘంగా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా మరో భారీ విజయంగా నిలిచింది. రవితేజ అంటే మాస్, కామెడీ, ఎనర్జిటిక్ యాక్షన్ అనే ఇమేజ్ ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అయితే 'ఇరుముడి'లో శివ నిర్వాణ ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన తీరు ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా రవితేజ నటనలోని ఎమోషనల్ షేడ్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ఇరుముడి' డిజిటల్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. అయితే స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో 'ఇరుముడి'కి ప్రధాన బలంగా నిలిచిన అంశాల్లో రవితేజ నటనతో పాటు చిన్నారి నక్షత్రతో ఆయనకు సంబంధించిన ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించాయని టాక్ వచ్చింది.



# ఘనంగా 'కళ్యాణం కమనీయం జీవితం' ట్రైలర్ లాంచ్.. ఈ నెల 18న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్!



టాలీవుడ్‌లో ప్రతిభావంతులైన యువ నటీనటులు, కొత్త ఆలోచనలతో వస్తున్న టెక్నీషియన్లను ప్రోత్సహించే చిత్రాలకు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ కోవలోనే యూత్ మరియు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఏకకాలంలో అలరించే సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోన్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". వివిఫై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించారు. రవి లోకిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఖాన్ దురాని, సాహితి ఆవంచ జంటగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఈ నెల 18న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ రాజవంశీ అత్యంత భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖ స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్, ప్రముఖ నిర్మాతలు కేఎల్ దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. ఈ వేడుకలో చిత్ర బృందం పంచుకున్న ఆసక్తికర విశేషాలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. సమాజంలో నేడు సర్వసాధారణంగా మారుతున్న భార్యాభర్తల బంధాలు, వాటి మధ్యలోకి ఒక మూడో వ్యక్తి ప్రవేశం వల్ల వచ్చే మనస్పర్థలు, ఆ సవాళ్లను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమను, బంధాన్ని ఎలా నిలబెట్టుకున్నారు అనే సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఎక్కడా అసభ్యతకు తావులేకుండా, కుటుంబం అంతా కలిసి నవ్వుతూ, భావోద్వేగానికి గురవుతూ చూసేలా ఈ క్లీన్ ఫ్యామిలీ అండ్ లవ్ ఎంటర్‌టైనర్‌ను రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. ఈ వేడుకలో నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ, తాము యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినప్పటికీ సినిమాపై ఉన్న మక్కువతో గతంలో '24 కిస్సెస్' చిత్రాన్ని నిర్మించామని, ఇప్పుడు కొత్తవారితో మరింత ఇన్నోవేటివ్ కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించాలనే తపనతో ఈ సినిమా చేశామని తెలిపారు. వ్యాపార లెక్కలకంటే మంచి సినిమా తీయాలనే ప్యాషన్‌తో పనిచేశామని, ఈ చిత్రంలోని లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను కచ్చితంగా కదిలిస్తాయని పేర్కొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512